ఉత్సవాల పేరిట వ్యాపారం చేస్తే ఉపేక్షించం

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించదలచినవారు తగిన అనుమతులు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. నిర్వాహకులు దరఖాస్తు చేసుకుంటే సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ఎవరైనా వినాయకుడి దర్శనానికి, పూజలు పేరిట టికెట్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తే వెంటనే వాటిని మూసి వేస్తామని స్పష్టంచేశారు. పూజాది కార్యక్రమాలు తొమ్మిది రోజులే నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల పేరుతో వ్యాపారం చేస్తే అంగీకరించబోమన్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు

దంచికొట్టిన వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అనేకచోట్ల రోడ్లపై నిలిచిపోయిన నీరు....
- ద్విచక్ర వాహనదారుల ఇక్కట్లు
- సీతమ్మధారలో 53.25 మి.మీ. వర్షపాతం నమోదు
- నేడు కూడా భారీవర్ష సూచన

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి)

నగరంలో శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. ఈ సీజన్‌లో తొలిసారిగా రుతుపవనద్రోణి దక్షిణ ఛత్తీస్‌గఢ్, విశాఖ మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించింది. ఇంకా అల్పపీడనం దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కొనసాగుతోంది. ఈ రెండింటి ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు భారీగా నగరంపైకి వీస్తున్నాయి. దీంతో శనివారం ఉదయం నుంచి మేఘాలు ఆవరించాయి. తెల్లవారుజామున నగర పరిధిలోని అనేక చోట్ల చిరుజల్లులు నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. అయితే, సాయంత్రం ఆరు గంటల తరువాత అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి, చల్లని గాలులు వీచాయి. ఎనిమిది గంటల సమయంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, భారీగాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు ... మిగతా 6వ పేజీలో



జ్ఞానాపురం బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

‘స్త్రీశక్తి’కి అనూహ్య స్పందన

ఆనందం మెండుగా... బస్సులు నిండుగా...

మహిళా ప్రయాణికులతో బస్సులు కిటకిట

- పథకం వర్తించే 570 బస్సుల్లో శనివారం 1.5 లక్షల మంది ప్రయాణం
- అందులో మహిళా ప్రయాణికులు 1.1 లక్షలు మంది...
- సింహాచలం, ఇస్కాన్ ఆలయాల రూట్లలో 110 శాతం ఆక్యుపెన్సీ



సిటీ బస్సులో స్త్రీశక్తి ఉచిత టికెట్లు చూపుతున్న మహిళా ప్రయాణికులు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో ‘స్త్రీశక్తి’ పథకానికి మంచి ఆదరణ లభిస్తోంది. పథకం వర్తించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో మూడొంతులు మహిళలే ప్రయాణించారు. స్త్రీశక్తి పథకాన్ని శుక్రవారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయడం జరిగింది. జిల్లాలో స్త్రీశక్తి పథకానికి సంబంధించిన 570 బస్సుల్లో శనివారం 1.5 లక్షల మంది ప్రయాణించారు. అందులో 1.1 మంది మహిళలు ఉన్నారు. ఆ బస్సుల్లో వినియోగించిన టికెట్ ఇష్యూయింగ్ మెషీన్స్ (టిమ్స్) ఆధారంగా ఈ లెక్కలు తేలాయి.**

సింహాచలం, ఆర్‌కే బీచ్, సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్, జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిరం రూట్లలో తిరిగే బస్సుల్లో 110 శాతం ఆక్యుపెన్సీ నమోదయ్యింది. మహిళలు అధికసంఖ్యలో దేవాలయాలకు రాకపోకలు సాగించినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. సాధారణంగా వారాంతపు సెలవు రోజుల్లోను, ఇతర సెలవు రోజుల్లోను ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని 804 బస్సుల్లో 1.3 లక్షల మంది ప్రయాణించేవారు. సగటు ఆక్యుపెన్సీ రేషియో 55 శాతంగా ఉండేది. కానీ వారాంతపు సెలవు, కృష్ణాష్టమి పర్వదినం అయినప్పటికీ శనివారం 570 బస్సుల్లో 1.5 మంది ప్రయాణించారు. సగటు ఆక్యుపెన్సీ రేషియో 80 శాతంగా ... మిగతా 6వ పేజీలో

ఉచిత రవాణా వల్ల నెలకు రూ.రెండు వేలు ఆదా

- జి.సావిత్రి, ప్రైవేటు ఉద్యోగిని, గాజువాక



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘స్త్రీశక్తి’ పథకం వల్ల మాలాంటి ప్రైవేటు ఉద్యోగులకు ఆర్థికంగా కొంత లబ్ధి కలుగుతుంది. ఇంటి నుంచి పనిచేసే ప్రాంతం సుమారు ఇరవై కిలోమీటర్లు ఉంటుంది. ప్రైవేటు రవాణా సాధనాల్లో వెళ్లినా, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లినా రోజుకు 60 నుంచి 80 రూపాయల వరకూ ఖర్చు అవుతుంది. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం వల్ల ఆ డబ్బులు సుమారు రూ.2 వేల వరకూ ఆదా అవుతాయి. వాటిని వేరే అవసరాలకు వినియోగించుకునేందుకు వీలు కలుగుతుంది.

ఏయూ మాజీ రిజిస్ట్రార్‌లకు బెయిలబుల్ వారెంట్లు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ అధికారులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. వర్సిటీలోని థియేటర్స్ ఆర్ట్స్ విభాగానికి చెందిన ముగ్గురు అధ్యాపకులు (కన్సాలిడేటెడ్) తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ 2011లో హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ కేసు నడుస్తోంది. తాజాగా రెండు రోజుల కిందట విచారణకు వచ్చింది. ఈ కేసు మొదలైనప్పటి నుంచి రిజిస్ట్రార్లుగా పనిచేసిన ప్రొఫెసర్ నిరంజన్, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ కృష్ణమోహన్‌తోపాటు ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ ధనుంజయరావు కోర్టుకు హాజరు కావాలని గత వాయిదా సమయంలో న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ప్రస్తుత రిజిస్ట్రార్ ధనుంజయరావు మినహా మిగిలిన ముగ్గురు కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి తొలుత నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. అయితే, ... మిగతా 6వ పేజీలో

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు!

అస్మదీయుల కోసం అడ్డగోలుగా వ్యవహరిస్తున్న జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు



- టెండర్ నోటిఫికేషన్ జారీలో నిబంధనలకు తూట్లు
- ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఎలక్ట్రికల్ వర్కు టెండర్ మాయం
- ఒక బడా కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు నాటకం
- బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామంటున్న చీఫ్ ఇంజనీర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన టెండర్లను కూడా మాయం చేస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో ఏదైనా పని చేయాలంటే ఇంజనీరింగ్ అధికారులు ముందుగా సంబంధిత ఏఈ ద్వారా దానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్‌తోపాటు ఎంత ఖర్చవుతుందని అంచనాలను తయారుచేయిస్తారు. తర్వాత డీఈ, ఈఈ, ఎస్ఈలు వాటిని పరిశీలించి అవసరమైతే చీఫ్ ఇంజనీర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తారు. కమిషనర్ స్థాయిలో అంచనాలను పరిశీలించి ఆమోదం తెలిపితే డ్రాయింగ్ బ్రాంచ్‌లో ఆ పనికి ఇంజనీరింగ్ అధికారులు వేసిన అంచనాలు ఎస్ఎస్ఆర్ రేట్లకు అనుగుణంగా ఉన్నాయో? లేదో పరిశీలించి టెండర్ పిలిచేందుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. కాంట్రాక్టర్లు తమ అర్హత, ఆసక్తిని బట్టి ఆయా పనులకు బిడ్‌లను వేస్తారు. ఎవరు ఎక్కువ లెస్‌కు వేస్తే వారితో ... మిగతా 6వ పేజీలో

ఘనంగా కృష్ణాష్టమి

సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాధాదామోదరులను బృందావనం నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. బాలగోపాలుడి ఉయ్యాల సేవలో తరించారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీరాధాదామోదరులు

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పట్టపగలు చోరీ

- 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- అదేబాక్సులో ఉన్న మరో 40 తులాల ఆభరణాలను విడిచిపెట్టిన దొంగలు

-6లో



వివరాలు సేకరిస్తున్న క్రైం పోలీసులు

పవర్ ప్లాంటు కూడా ప్రైవేటుకు...!

- స్టీల్ ప్లాంటు యాజమాన్యం నిర్ణయం
- థర్మల్ పవర్ ప్లాంటులో 2/3 నిర్వహణ
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు నోటిఫికేషన్
- ఒక్కొక్క విభాగం ప్రైవేటుపరం చేస్తుండడంపై కార్మికుల ఆందోళన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం స్టీల్ యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్లాంటుకు అవసరమైన విద్యుత్‌ను తయారుచేస్తున్న థర్మల్ పవర్ ప్లాంటులో 2/3వ వంతు ప్రైవేటు నిర్వహణకు ఇస్తామంటూ శనివారం నోటిఫికేషన్ ఇచ్చింది.

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం గత నాలుగు నెలల నుంచి ఒక్కో విభాగాన్ని ప్రైవేటుకు ఇవ్వడానికి నోటిఫికేషన్లు ఇస్తోంది. తొలుత ప్లాంటులో నాణ్యతను తనిఖీ చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే క్వాలిటీ ఎస్యూరెన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌ను ప్రైవేటుకు ఇస్తామని టెండర్లు పిలిచింది. ఆ విభాగంలో 100 మంది పనిచేస్తున్నారు. ఆ తరువాత ప్లాంటుకు గుండెకాయ వంటి రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్ఎంహెచ్‌పీ), సింటర్ ప్లాంట్లను కూడా ప్రైవేటుకు ఇస్తామని టెండర్లు పిలిచింది. ఈ రెండు విభాగాల్లో సుమారు 750 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిని తప్పించడానికి ప్రణాళిక రూపొందించారు. ఆ తరువాత ప్లాంటులో ఎక్కడ ప్రమాదం జరిగినా తక్షణమే స్పందించే ఫైర్ విభాగం ప్రైవేటీకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో 280 మంది పనిచేస్తున్నారు. వారిలో చాలామందిని ఇప్పటికే పక్కనపెట్టారు. ఇప్పుడు తాజాగా థర్మల్ పవర్ ప్లాంటులో కొంత ప్రైవేటుకు ఇస్తామని ప్రకటించారు.

సొంతంగా విద్యుత్ ఉత్పత్తి

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో 315 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ ప్లాంటు ఉంది. ఇది కాకుండా వృథా వాయువుల నుంచి మరో 120 మెగావాట్లు ఉత్పత్తి చేస్తారు. మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 435 మెగావాట్లు. ఈ రెండూ పూర్తిస్థాయిలో పనిచేస్తే సొంత అవసరాలకు వాడుకోగా, ఇంకా కొంత మిగులుతుంది. దానిని గ్రిడ్‌కు సరఫరా చేసేవారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియ తెరపైకి వచ్చిన తరువాత అన్ని వైపుల నుంచి సహాయ నిరాకరణ మొదలైంది. థర్మల్ విద్యుత్ ప్లాంటుకు అవసరమైన బాయిలర్ బొగ్గు సరఫరా తగ్గిపోయింది. దాంతో సొంత ఉత్పత్తి పడిపోయింది. ఈపీడీసీఎల్... మిగతా 6వ పేజీలో



పద్మనాభంలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

పద్మనాభంలో ఊపందుకున్న వరి నాట్లు

పద్మనాభం రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. బంగాళాఖాతంలో అల్ప పీడనం వల్ల గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. దీంతో పలు గ్రామాల్లో రైతులు దమ్ములు చేపట్టి, నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో ఏటా సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తుంటారు. ఈసారి వర్షాభావం వల్ల ఇప్పటివరకు సగం కూడా వరి నాట్లు పడలేదు. బోర్లు, ఇతర సాగునీటి వనరులు ఉన్న చోట మాత్రమే రైతులు అరకొరగా నాట్లు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జోరుగా నాట్లు వేస్తున్నారు. కాగా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏఓ చలం తెలిపారు. పంటకు తగిన మోతాదులో ఎరువు వేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

సాగర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో రాజనీతి అన్న అంశంపై నగరంలోని పాఠశాలల విద్యార్థులకు శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నిర్వాహకులు రూ. 10 వేలు, రూ. 7 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసోజా, తదితరులు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి'

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, వారిని ఆదుకోవాలని మండలంలోని చిప్పాడ, చిట్టివలస, రాయిపాలెం, తాళ్లవలస ఆటో స్టాండుల అధ్యక్షులు కోరారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిందని,ఈమేరకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మధురవాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శిల్పారామంలో శనివారం నగరానికి చెందిన లియో డ్యాన్స్ అకాడమీ కళాకారులు పలు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. పలు కీర్తనలకు సంజన, మహీంద్ర, జ్యోతిక, రేణుకా శ్రీ నృత్యాలు చేశారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ర్యాలీ

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని డిమాం డ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో అడవివరం, విజనగిరిపాలెం గ్రామాల్లో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతూ ఇప్పటికే అధిక విద్యుత్ బిల్లులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే మరిన్ని అవస్థలు ఎదుర్కోవాల్సిన వస్తుందని చెప్పారు. అలాగే గిరిజనులకు జగ్జీవన్ జ్యోతి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఈపీడీసీఎల్ ఈఈకి నగదు బహుమతి



సీఎండీ నుంచి నగదు బహుమతి అందుకుంటున్న ఈఈ పోలాకి శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో విధులు నిర్వహించి, లక్ష్యాలు పూర్తి చేసినందుకు జోన్-1 ఈఈ పోలాకి శ్రీనివాసరావుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శుక్రవారం రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే ఉత్తమ సేవలందించినందుకు పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పట్టపగలు చోరీ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో పట్టపగలు భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంటు సెక్టార్-6లోని 105 బి క్వార్టర్స్‌లో హెచ్‌ఆర్ విభాగం డీజీఎం ఎన్.సుందరం కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువా గడియ విరగ్గొట్టి ఉండడంతో స్టీల్‌ప్లాంటు క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లో సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఒకే బాక్సులో సుమారు 64 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆ బాక్సులో చిన్న చిన్న వస్తువులు మొత్తం 24 తులాల ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మిగతా 40 తులాలు అలాగే ఉన్నాయి. చోరీపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ రిజిస్ట్రార్‌లకు బెయిలబుల్ వారెంట్లు

... 5వ పేజీ తరువాయి

ఏయూ స్టాండింగ్ కౌన్సిల్‌కు చెందిన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ప్రస్తుత రిజిస్ట్రార్ కోర్టుకు హాజరయ్యారని, మరో ఇద్దరు వర్చువల్‌గా హాజరయ్యారని న్యాయమూర్తికి వివరించారు. అయితే కోర్టుకు నేరుగా హాజరుకావాలని చెప్పినప్పటికీ రాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి ముగ్గురు మాజీ రిజిస్ట్రార్లకు బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ ఆదేశాలిచ్చారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ, నలుగురు కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

యారాడ ఘాట్ రోడ్డులో నక్షత్ర తాబేళ్లు లభ్యం



సింధియా,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నగరానికి సమీపంలోని యారాడ ఘాట్‌రోడ్డులో శనివారం రెండు నక్షత్ర తాబేళ్లు తారసపడ్డాయి. ఆ మార్గంలో వెళుతున్నవారి ద్వారా విషయం తెలుసుకున్న స్నేక్‌క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.వారు వచ్చి స్వాధీనం చేసుకుని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూలాజికల్ పార్కు)కు తరలించారు. జూలో 200 నక్షత్ర తాబేళ్లు ఉన్నాయని, అక్కడే ఈ రెండింటిని విడిచిపెడుతున్నట్టు తెలిపారు.



భీమిలిలోని ప్రైవేటు పాఠశాలలో చిన్నారుల వేషధారణ



భీమిలిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- నియోజకవర్గం వ్యాప్తంగా ఉత్సవం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలు గ్రామాల్లో ఉట్టి కొట్టిన యువత

భీమునిపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలో శివ, కేశవ ఆలయాల సముదాయంలో రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి వేకువ జాము నుంచి పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు రొంపిచెర్ల సింగాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకూ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.గొల్లవీధి కృష్ణాలయంలోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, యాదవ సంక్షేమ సంఘం నాయకుడు గొలగాని నరేంద్రకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఉదయం ఏడు నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు బూర వరహాలు, బొట్ల అచ్చన్న, దువ్వి రామకృష్ణ, ఆవాల నరసింగరావు, దువ్వి అప్పారావు, బొట్ల సూరిబాబు, కిలారి మురళీకృష్ణ, దువ్వి రాంబాబు, నక్కిళ్ల వెంకటరావు, నల్ల వగలబాబు పాల్గొన్నారు. ది సన్ స్కూల్లోనూ వేడుకలు జరిగాయి. స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 230 మంది చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో అలరించారు.

గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో...

ఆనందపురం :మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున బాలగోపాలునికి 108 నదుల పవిత్ర జలాలతో, పళ్ల రసాలతో మహా అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులతో బాలగోపాలునికి అభిషేకం జరిపించారు.ఈ సందర్భంగా హరేకృష్ణ వైకుంఠం అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస కృష్ణాష్టమి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

లక్ష్మీపురంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



వెంకటాపురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో బాలగోపాలునికి పూలాభిషేకం

భీమునిపట్నం (రూరల్) : లక్ష్మీపురంలోని ఆనంద ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.హిందూ జ్ఞాన వేదిక, త్రైత సిద్ధాంత సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

మధురవాడ : మధురవాడలోని పలు ప్రాంతాల్లోనూ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. స్వతంత్రనగర్ కాలనీ, బొట్టవానిపాలెం, గణేశ్ నగర్ కాలనీల్లో యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహిచించారు.

పద్మనాభంలో బాల గోకులం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం బాల గోకులం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. అనంతరం మూడేళ్ల నుంచి 12 ఏళ్లలోపు చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణలో వచ్చి శ్లోకాలు, పద్యాలతో అలరించారు. పోటీల్లోని విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, నాయకులు టి. పద్దు, కె. ఎర్నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు టి. పైడిరాజు, ఆర్‌వీ నారాయణ, గోపీనాథ్, అరుణ్‌కుమార్, రామస్వామి, రామం, వెంకటాచారి, విజ్ఞాన విహార ప్రతినిధులు నాగేశ్వరరావు, ముక్తేశ్ పాల్గొన్నారు. మద్ది గ్రామంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ముందుగా కృష్ణపరమాత్ముని విగ్రహాన్ని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికి శ్రీకృష్ణుడి భగవద్గీత జ్ఞానాన్ని అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 11 రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు, నిర్వాహకులు త్రినాథరావు, కృష్ణసూరప్పడు, సురేశ్ పాల్గొన్నారు.అలాగే వెంకటాపురం గ్రామంలోనూ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపి, ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, సర్పంచ్ కర్రి రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సన్యాసప్పడు, గంగరాజు, డీలరు శ్రీను, విద్యా కమిటీ ఛైర్మన్ సూరప్పడు, ఉత్సవ నిర్వాహకులు బంగారుబాబు, గణేశ్ పాల్గొన్నారు.



సింహాచలం కూడలిలో నిర్మించిన పురూరవ సత్రం



శ్లాబ్‌పై నిలిచిన వర్షం నీరు

ప్రమాదకర స్థితిలో పురూరవ సత్రం

- శిథిలమైన శ్లాబ్
- బీటలు వారిన గోడలు, షెడ్‌లు
- వర్షం వస్తే మరింత నరకం
- పట్టించుకోని సింహాచలం దేవస్థానం అధికారులు

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు తక్కువ ఖర్చుతో వసతి కల్పిస్తున్న పురూరవ సత్రం ప్రమాదకర స్థితిలో ఉంది.స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల్లో అత్యధికులు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గ్రామీణులే. వారికి తక్కువ అద్దెతో వసతి కల్పించాలన్న ఉద్దేశంతో సింహాచలం ప్రధాన కూడలిలో అప్పటి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పీవీజీ రాజు అనుమతితో నాటి కార్యనిర్వాహణాధికారి ఎన్. అరవిందాక్షన్ వసతి గృహ (సత్రం) నిర్మాణానికి ట్రస్టు బోర్డు అనుమతి తీసుకున్నారు. ఏడాదిలో 20 గదులతో



పెచ్చులూడిన డూమ్

పురూరవ సత్రం నిర్మించారు. 1976 ఫిబ్రవరి 18న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి సాగి సూర్యనారాయణరాజు ప్రారంభించారు. భవనంలో కింద,పైన నాలుగు విశాలమైన హాళ్లు నిర్మించి, వాటిని వివాహాది శుభ కార్యాలకు అద్దెలకు ఇచ్చేవారు. భవనం కింద భాగంలో రెండు హోటళ్ల కోసం హాళ్లు,సుమారు 20 దుకాణాలు నిర్మించి వాటిని కూడా అద్దెలకు ఇస్తున్నారు. పైభాగంలోని గదులు రూ. 50 రోజుకు అద్దె ప్రాతిపదికన భక్తులకు ఇస్తున్నారు.చాలా ఏళ్ల సత్రంలో అనేక మంది వివాహాలు జరిపించుకోవడం, యాత్రకు వచ్చి వారు రాత్రి బస చేయడం చేసేవారు. తరువాత భవనం నిర్వహణను పట్టించుకోకపోవడంతో మరమ్మతుకు గురైంది. పై అంతస్తులోని గదులు, హాళ్ల పూర్తిగా నిరుపయోగంగా మారాయి. దిగువన రెండు హాళ్లలో ఒకటి పూర్తిగా శిథిలం కావడంతో నిరుపయోగంగా ఉంచేశారు. కింద భాగం వెనుక భాగంలోని రెండు మూడు దుకాణాలు కూడా వినియోగానికి అనుకూలంగా లేక ఖాళీగా ఉన్నాయి. ఐదేళ్ల క్రితం పైఅంతస్తులోని గదులను సింహగిరి దివ్యక్షేత్రం పనుల్లో గిరిజన గ్రామం నుంచి దిగిన కొన్ని గిరిజన కుటుంబాలకు దేవస్థానం కేటాయించింది. అయితే ఆ గదులు కొద్దిపాటి వర్షానికే కారిపోతున్నాయి. భవనం పైభాగంలో శ్లాబ్ పూర్తిగా పాడైంది. నీరు నిల్వ ఉండి గదుల్లోకి చెమ్మ పడుతోంది. దీంతో గదుల్లో నివాసం ఉంటున్న గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. వర్షాలకు భవనం ఏక్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే దేవస్థానం అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

భీమునిపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్తరాంధ్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ శనివారంతో ముగిసింది. ట్రోఫీని వైజాగ్ ఎస్‌ఆర్‌కే జట్టు కైవసం చేసుకుంది. నిర్వాహకుడు, కేఎస్ఎస్ ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ విజేత జట్టుకు రూ. 50 వేలు, ట్రోఫీ అందజేశారు.రన్నర్స్‌గా నిలిచిన చిట్టివలస జట్టుకు రూ. 25 వేలు నగదు, బెస్ట్ క్రీడాకారులకు రూ.5 వేలు ఇచ్చారు. అనంతరం భీమిలిలోని సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఫుట్‌బాల్ అసోసియేషన్, వైజాగ్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, కె. భానోజీరావు, కె.శ్రీనివాసరావు, అత్తిలి చినబాబు, నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కలిగొట్ల శ్రీరామ్



స్వామివారికి కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులకు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు పంపిణీ చేశారు.

నంబర్ వన్‌గా భీమిలి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖామంత్రి లోకేశ్‌తో భేటి



ఎమ్మెల్యే గంటాకు వాయిస్ ఆఫ్ పీపుల్ పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి లోకేశ్

భీమునిపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి, నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఉండవల్లిలో మంత్రిని కలిశారు. ఆ వివరాలను ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఐటీ సహా విద్యా, పర్యాటక రంగాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలపై మంత్రితో చర్చించామన్నారు. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్, పీఫీ వంటి అగ్రశ్రేణి ఐటీ కంపెనీలను నియోజకవర్గం పరిధిలోకి తీసుకువస్తున్నారని చెప్పారు. మధురవాడకు డిగ్రీ కళాశాల, పద్మనాభం మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. బీచ్‌రోడ్‌లో ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు తిమ్మాపురంలో ఐదు ఎకరాలు మంజూరు చేసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆ స్థలం అందజేయలేని పరిస్థితి ఉందని, కాపు భవన్‌కు ఎండాడలో టీడీపీ అధికారంలో ఉండగా ఇచ్చిన ఎకరా స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం అర ఎకరాకి కుదించిన అంశాన్ని, నియోజకవర్గంలోని ఏడు గ్రామాల్లో ఇనాం భూములు సాగు చేస్తున్న రైతులు కష్టాలను మంత్రి వివరించానని చెప్పారు. ఎంవీపీ, సాగర్‌నగర్ కాలనీల మాదిరి భీమిలి, భోగాపురం మధ్యలో శాటిలైట్ టౌన్ షిప్‌ను ప్రతిపాదించాల్సిన ఆవశ్యకతను, 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన చిట్టివలస పెద్ద చెరువు సుందరీకరణ, తగరపువలసలో ఆర్‌టీసీ బస్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు గురించి విన్నవించామన్నారు. మధురవాడలో వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఆనందపురంలో వంద ఎకరాల్లో మహిళలకు ప్రత్యేక ఎస్ఈజడ్, అయినాడ - రేవిడి రహదారి విస్తరణ గురించి కూడా చర్చించామన్నారు. ఈ విషయాలన్నింటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వాయిస్ ఆఫ్ పీపుల్ పేరుతో రాసిన పుస్తకాన్ని మంత్రి, ఎమ్మెల్యే గంటాకు అందించారు.

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు!

... 5వ పేజీ తరువాయి

వర్క్ అగ్రిమెంట్ చేసుకుని ఆర్డర్ అందజేస్తారు. ఒకసారి టెండర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే తర్వాత తొలగించడానికి అవకాశం ఉండదు. కానీ తాజాగా ఎలక్ట్రికల్ విభాగంలో ఒక పనికి సంబంధించిన టెండర్ వెబ్‌సైట్ నుంచి మాయం కావడం చర్చనీయాంశంగా మారింది. జీవీఎంసీ 31వ వార్డు పరిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ క్వార్టర్స్ నుంచి లీలామహల్ జంక్షన్ మీదుగా డీమార్ట్ జంక్షన్ వరకూ వీధి దీపాలకు సంబంధించిన స్తంభాల ఏర్పాటుకోసం రూ.16.36 లక్షలతో (టెండర్ ఐడీ 834773) జోన్-3 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈనెల ఒకటిన ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ పిలిచారు. బిడ్ దాఖలుకు ఈనెల 13 మధ్యాహ్నం 3.30 గంటల వరకు గడువు ఇచ్చారు. అయితే ఆగస్టు 12 వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఆ టెండర్ కనిపించింది. 13న ఆఖరు తేదీ కావడంతో బిడ్ వేసేందుకు కాంట్రాక్టర్లు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వగా ఆ టెండర్ కనిపించలేదు. అప్పటికే ఆ టెండర్ వివరాలను ప్రింట్ తీసుకున్న కాంట్రాక్టర్లు ఐడీ నంబర్ ఆధారంగా వెతికినా కనిపించకపోవడంతో తమకు తెలిసిన వారిని సంప్రదించారు. ఆపనిలో బాగా డబ్బులు మిగిలేందుకు అవకాశం ఉండడంతో ప్రస్తుతం పిలిచిన టెండర్‌లో కొన్ని ప్రత్యేక అర్హతలు ఉండాలని షరతు విధిస్తూ తమకు అనుకూలంగా దానిని రీకాల్ చేయాలని ఒక కాంట్రాక్టర్ సంబంధిత అధికారిని కోరడంతో అలా చేసినట్టు సిబ్బంది చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి చాలా జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అస్మదీయ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారి బండారం బయటపడుతుందని చెబుతున్నారు. ఈ విషయం చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు వద్ద ప్రస్తావించగా, ఒకసారి ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పెట్టిన టెండర్‌ను తొలగించడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే మిగిలిన వారిలో భయం వస్తుందన్నారు.

ఆనందం మెండుగా...

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. ఇది స్త్రీశక్తి ప్రభావమే అని ఆర్టీసీ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఇక శ్రీకాకుళం, పలాస, టెక్కలి, మందస, పాతపట్నం, రాజాం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 80 శాతం ఆక్యుపెన్సీ తో తిరిగాయి. ఇందులో కూడా 60 శాతం జీరో టికెట్లు జారీ అయినట్టు అధికారులు తెలిపారు. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతిలు సింహాచలం, ఆర్‌కే బీచ్ రూట్లలో తనిఖీలు చేశారు. బస్సుల్లో స్వయంగా జీరో టికెట్లు జారీచేశారు. ఆధార్ కార్డును సెల్‌ఫోన్‌లో చూపించినా మహిళలకు జీరో టికెట్లు జారీ చేయాలని కండక్టర్లను ఆదేశించారు.

పవర్ ప్లాంటు కూడా ప్రైవేటుకు...!

... 5వ పేజీ తరువాయి

నుంచి విద్యుత్ తీసుకోవడం మొదలైంది. దానికి నెలకు రూ.80 కోట్ల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఆ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో థర్మల్ పవర్ ప్లాంటులో 2/3వ వంతు అంటే 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ప్రైవేటుకు ఇస్తామంటూ శనివారం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఈఓఐ) ఇచ్చింది. ఈ టెండర్‌లో ఎవరైనా పాల్గొనవచ్చునని, రేటు వారే కోట్ చేయాలని పేర్కొంది. కోల్ ప్లాంటు-1, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అంతా వారే చూసుకోవాలి. కోల్ కన్వేయర్ గ్యాలరీలు, కోల్ బంకర్ గ్యాలరీలు, బాయిలర్లు, టర్బో జనరేటర్లు, యాష్ వాటర్, యాష్ హ్యాండ్లింగ్ విభాగం వంటివి వారే నిర్వహించాలి. మొత్తం 210 మెగావాట్లు ఉత్పత్తి నిర్వహణకు ఇస్తే రోజుకు కనీసం 120 మెగావాట్లు కచ్చితంగా ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఎలక్ట్రికల్ సెక్షన్ ఆపరేషన్ మొత్తం వారే చూసుకోవాలి. ఈ టెండర్ ఖరారైతే 150 మంది ఉద్యోగులను తగ్గించాల్సి వస్తుందంటున్నారు. ఇలా విభాగాల వారీగా ప్రైవేటుపరం చేస్తుండడంపై కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

దంచికొట్టిన వర్షం

... 5వ పేజీ తరువాయి

పెద్ద ఎత్తున వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. రైల్వే న్యూకాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, జ్ఞానాపురం, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేకచోట్ల రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. నగరంలో ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెట్లు, హోర్డింగ్‌ల కింద ఉండకూడదని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

శనివారం ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకూ నగరంలో పలుచోట్ల నమోదైన వర్షపాతం వివరాలు

ప్రదేశం	మిల్లీమీటర్లు
సీతమ్మధార పంపు హౌస్	53.25
పెందుర్తి జోనల్ ఆఫీసు	45.25
పద్మనాభం	42.75
పెందుర్తి గణేష్ నగర్	42.25
సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం	39.75
భీమునిపట్నం	38


ఎంవీపీ కాలనీ : పూజల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరీంధిరప్రసాద్


ఎంవీపీ కాలనీ : అలంకరణలో రాధాకృష్ణులు


వెంకోజీపాలెం : ఇసుకతోట శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయిదుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

» కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు » బాలకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు » పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా ఉట్టి ఉత్సవాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పరిసరాలు హరేకృష్ణ నామస్మరణతో మార్మోగాయి. భక్తుల రద్దీతో రహదారులు కిక్కిరిశాయి. హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలతో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజైన శనివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

నగరంలోని ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హరీంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు. బాలగోపాల్, రాధామదనమోహన్ విగ్రహాలకు ప్రాతఃకాల అభిషేకం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు డాక్టర్ నిష్కించిన భక్త దాస పూజలను ప్రారంభించారు. సప్తనదుల నుంచి సేకరించిన జలాలతో ఉదయం అభిషేకం చేశారు. కళాకారులు ద్వారం త్యాగరాజ్ బృందం, చైతన్య బ్రదర్స్, డాక్టర్ సరస్వతి విద్యార్థుల బృందం, గట్టి శ్రీవిద్య, విద్యాధరి మ్యూజిక్ స్కూల్ బృందాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సుమారు 5 వేల మంది భక్తులు బాలగోపాలుడిని దర్శించుకున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉట్టి కొట్టే మహోత్సవంలో చిన్నారులు, యువత భారీగా పాల్గొన్నారు. కృష్ణతో సెల్ఫీ వంటి అనేక ఆటల పోటీల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారీ ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఉదయం పది నుంచి ఒంటి గంట వరకూ, సాయంత్రం 5 నుంచి 9 వరకూ భక్తులు దర్శనం చేసుకున్నారు. మహా అభిషేకం, మంగళ హారతి నిర్వహించారు. 108 పవిత్ర జల కలశాలు, పండ్ల రసాలు, పంచామృతం, పంచంగవ్యాలు, వివిధ పుష్పాలతో మహాభిషేకం నిర్వహించారు. దర్శనానికి కుటుంబ సమేతంగా వచ్చిన వారు తమ చిన్నారులను రాధ, చిన్నికృష్ణుల వేషధారణలో తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక ఆచార్య భక్తి వేదాంతస్వామి ఆవిర్భావ దినోత్సం సందర్భంగా వెయ్యి రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించనున్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : 'జైకృష్ణ.. జైజై కృష్ణా..' అంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కృష్ణుడు, గోపికల వేషధారిణలో చిన్నారులు అలంకరించుకుని వీధుల్లో సందడి చేశారు. వివిధ యాదవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసుకతోటలోని శ్రీమురళీకృష్ణ జ్ఞాన మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల వేడుకగా నిర్వహించారు. కృష్ణ భగవానుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు బారులు తీరారు. సుందరసత్సంగ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మందిరంలో కృష్ణాష్టమినిపురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. తులాభారం, గోపూజ, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు ఆది వారం చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్సంగ్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, సాంబమూర్తిరాజు, ఆలయ ప్రధానార్చకులు కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఇక్కడి సామాజిక భవనంలో కృష్ణుడి ప్రతిమను ఉంచి పూజలు నిర్వహించన్నట్టు సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు తెలిపారు. ఆదివారం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపడతామని, సోమవారం స్వామివారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇసుకతోటలో...

ఇసుకతోటలోని శ్రీకృష్ణఉమామహేశ్వర సాయిదుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా పాల్గొని స్వామివారిని కొలిచారు. ఈ సందర్భంగా కృష్ణ భగవానుడికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపీకృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రరావు, సహాయ కార్యదర్శి ముగడ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఈగల రమణ, ఒమ్మి గోపినాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్, ప్రచార కార్యదర్శి ఉప్పిలి కృష్ణంనాయుడు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల పాత ఆరిలోవలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీయశోదాబాలగోపాల్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి అత్యంత ఇష్టమైన వెన్నను నైవేద్యంగా నిర్వాహకులు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి సందర్భంగా పెదగదిలిలో గల శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీ కృష్ణ వేషధారణలో మోహిత్ ఎంతగానో ఆకట్టుకున్నాడు, కార్యక్రమంలో భాగంగా సంఘ అధ్యక్షుడు ఒమ్మి వెంకటఅప్పారావు, ప్రతినిధి ధూళి రఘు బొట్ట రమణ తదితరలు పాల్గొన్నారు, అలాగే సాలిసేటలో బాలమురళి సంఘం ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఒమ్మి పోలారావు, ఒమ్మి మోహన్, బొట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పీతలవానిపాలెంలోని రాధాకృష్ణ మందిరంలో శనివారం శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడుకి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు చిన్నికృష్ణుడి వేషధారణతో మురిపించారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. స్వామి వారి ఆలయంలో భజనలు చేసి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, గ్రామపెద్దలు పెసల శ్రీను, సత్యం, పీతల గోవింద్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆరిలోవ : 11వ వార్డులోని పాత ఆరిలోవలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర


మద్దిలపాలెం : శ్రీకృష్ణుడుకి పూజలు చేస్తున్న భక్తులు


ఎంవీపీ కాలనీ : చిన్నికృష్ణుడి ఉట్టి సంబరం

ఉత్సాహంగా తిరంగా ఫ్యాషన్ కిడ్స్ వాక్


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా

సిరిపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎరీనా థియేటర్‌లో నిభాంగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తిరంగ్ ఫ్యాషన్ కిడ్స్‌వాక్ అలరించింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో చురుకుదనం, తద్వారా ఆరోగ్యం వంటివి పెంపొందించవచ్చన్నారు. నిభాంగ్ ప్రతినిధి పి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేశభక్తికి చెందిన కార్యక్రమాలను చేపడుతున్నామని, విశాఖలో ఈ కార్యక్రమాన్ని రెండోసారి చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ పతకాలు సాధించిన రుషిల్‌బెండీని సత్కరించారు. కె.కిరణ్‌కుమార్, బి.నిరుపమ్, వి.వింధ్య తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.


చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

17న 'ఘంటసాల ది గ్రేట్' చిత్రం ప్రివ్యూ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల జీవితాన్ని ఆధారంగా మాజీ పోలీసు అధికారి సీహెచ్ రామారావు తెరకెక్కించిన ఘంటసాల ది గ్రేట్ ప్రీ రివ్యూ షో ఈ నెల 17న ఉదయం 8 గంటలకు శ్రీ రామ టాకీస్‌లో ప్రదర్శించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ చిత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాఖ గాయనీగాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జయహో ఇండియా' పాట ఆవిష్కరణ



జయహో ఇండియా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తిని పెంపొందించడానికి, యువతను ఉత్తేజ పరచడానికి నిర్మించిన జయహో ఇండియా వీడియో పాటను ప్రముఖ సంఘ సేవకుడు నరవ ప్రకాశరావు లాసన్స్‌బేకాలనీలో ఆవిష్కరించారు. ప్రస్తుత తరాలకు అప్పటి స్వాతంత్ర్య సమరయోధుల అంశాలను పొందుపరచిన వీడియో ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎం నాయుడు, న్యాయవాది ఎస్ రఘురాం, శివశ్రీ మీగడ, దీప్తి మీగడ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలుగా నిర్మాణ వ్యర్థాలు


కేడీపీఎం స్కూల్ రహదారి పక్కన వ్యర్థాలు

పెదవాల్తేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఈస్టు పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్ ఎదురుగా రహదారి పక్కన పలుచోట్ల భవననిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా వేస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రుళ్ళు జన సంచారం తక్కువగా ఉండడం చూసి కొంత మంది లారీలు, ఆటోలలో గుట్టలుగా వ్యర్థా లు తీసుకొచ్చి పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఈ వ్యర్థాలలో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని, వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని, దీనివల్ల వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవిఎంసీ, పోలీసు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

18వ వార్డులో తాగునీటి బోరు ప్రారంభం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని అప్పుఘర్ శ్రీరాములవారి ఆలయం సమీపంలో మంచి నీటి బోరును కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు ప్రారంభించారు. ఈ బోరువెల్ అందుబాటులోకి రావడంతో సమీపంలో నీటి ఎద్దడి నివారణకు ఉపయోగపడుతుందని కార్పొరేటర్ అన్నారు.

కార్యక్రమంలో తెదేపా నాయకులు కారి రామారావు, సీతారామయ్య, కోడా గురయ్య, సింహాద్రి, కుల పెద్ద సీతారామయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● వార్-2 : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● కూలీ : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● సార్, మేడమ్ : మౌర్య (గోపాలపట్నం),
● మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24,బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు(కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఈవో వేంద్ర తినాథరావు తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మూడు బ్యాచ్‌లతో వ్రతాలు నిర్వహి స్తామని చెప్పారు. ఆసక్తి గల భక్తులు కొండపై పీఆర్‌వో కార్యాలయంలో ఆధార్‌కార్డు చూపించి, పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని మాత్రమే అనుమతిస్తా మన్నారు. పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానం సమకూరుస్తుందని, కొండపైకి రాకపోకలు సాగించడానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వరలక్ష్మీ వ్రతాలు నేపథ్యంలో ఆ రోజు జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈవో ప్రకటించారు.

వర్షాలతో చిరు వ్యాపారుల ఇబ్బందులు

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులనుంచి ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఆరిలోవ పరిసర ప్రాంతాలు చిత్తడిగా తయారయ్యాయి. రోడ్లు బురద మయంగా మారాయి. చిరు జల్లుల వల్ల సాయంత్రం వ్యాపారాలు నిర్వహించుకునే తినుబండారాల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల వల్ల వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు వాపోయారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం

» విశాఖ జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు


లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న వాసుదేవరావు, సంఘు సభ్యులు

రామ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల కోసం సర్దార్ గౌతులచ్చన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖ జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా గ్రీన్ పార్కు రోడ్డులో ఉన్న లచ్చన్న విగ్రహానికి శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతులచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించ డం అభినందనీయమన్నారు. పలాస కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విశాఖ జిల్లాలో స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ప్రసాద్, తోట శేఖర్, బొంగు సత్తిరాజు, గడ్డి తిరుపతిరావు, తోట హరికృష్ణ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కూటమివి సూపర్ డూపర్ ఫ్లాప్ పథకాలు

» ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


విలేకరులతో మాట్లాడుతున్న కల్యాణి

మద్దిలపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ డూపర్ ఫ్లాప్ అయ్యాయని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం కాదు స్త్రీకి వంచన పథకమని విమర్శించారు. రాష్ట్రంలో 11 రకాల బస్సులు ఉంటే 5 రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణానికి ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల మహిళలకు ఏ బస్సులో ప్రయాణంలో చేస్తే టిక్కెట్ ఉండదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇది ఉచిత బస్సు ప్రయాణం కాదని, ఉచిత బోగస్ ప్రయాణమని ఎద్దేవా చేవారు. తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టారన్నారు. వివిధ ఆంక్షలు నిబంధనలు పెట్టి 30 లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టారన్నారు.

నేడు భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల గృహాలకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్లుగా భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు కంటున్న కలలు ఆదివారం నిజం కానున్నాయి. సొసైటీ సభ్యుల గృహాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరగనున్నది. దీంతో 360 మంది సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి సొసైటీ పాలకవర్గం 360 మంది సభ్యులకు సొంతిళ్లు నిర్మించాలని సాలాపువానిపాలెం సమీపంలో 36 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది.

విపత్తు నిర్వహణకు జీవీఎంసీ అప్రమత్తం

» అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆదేశం
» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలు, గాలివానలు, వడగళ్ల వాన వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీ అన్ని విభాగాలు తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో పలు చోట్లవర్షాలు అధికంగా కురుస్తున్నాయని, మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న సమాచారంతో ఇప్పటికే జీవీఎంసీ అప్రమత్తతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలోనున్న భవనాలను గుర్తించి నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేశామని తెలిపారు. నగరంలో డ్రైనేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్, అధికంగా నీరు ప్రవహించే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, అలాగే నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసినట్టు చెప్పారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున నగరంలో శిథిలావస్థలోనున్న హోర్డింగులను గుర్తించి వాటిని వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలని, అగ్ని ప్రమాదాలు సంభవించినట్టయితే ప్రజల రక్షణ దిశగా జీవీఎంసీ రీజనల్ అగ్నిమాపక అధికారి తగు చర్యలు చేపడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజా ప్రతినిదుల సహకారంతో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జీవీఎంసీ వాహనాలు, జనరేటర్లు, చెట్లను తొలగించే యంత్రాలు, ఎక్సకవేటర్లు, ట్రక్కులు, ఇంధనం, సమాచార రేడియో హ్యాండ్ సెట్‌లను వంటి అవసరమగు పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. అలాగే జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని రక్షణ చర్యల చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


గీతాభవన్‌లో శ్రీకృష్ణునికి అలంకరణ


గణేష్‌నగర్‌లో తులసీమాలలతో కృష్ణునికి పూజలు


సీతంపేటలో వేణుగోపాలుడు


మురళీనగర్‌లో చిన్నారులతో పార్కు కమిటీ సభ్యులు

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వన్‌టౌన్ శ్రీ గీతాభవన్‌లో శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తికి మంగళధ్వని, వేద మంత్రాలతో పంచామృతాబిషేకం నిర్వహించారు. అనంతరం తులసి అర్చన ఉట్టికోట్టే సంబరం, ఉయ్యాల ఉత్సవం, శ్రీకృష్ణ వేషధారణ దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.వనజాదేవి, జి.వి.ఆర్.ప్రసాద్, లక్ష్మీనరసింహ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మురళీనగర్: వైశాఖీ స్పోర్ట్సు పార్కు ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం భగవద్గీత పారాయణం, సంప్రదాయ నృత్యాల మధ్య కోలాహలంగా ఉట్ల సంబరాన్ని చేపట్టారు. స్థానిక యువత, చిన్నారులు, మహిళలు ఉత్సవంలో పాల్గొన్నారు. పార్కు కమిటీ ప్రెసిడెంట్ ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో శ్రీ కృష్ణ భక్త బృందం చేపట్టిన కీర్తనలు ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుని పూజా కార్యక్రమాలు, ఉత్సవ ప్రత్యేక దర్శనాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు పండుగ నిర్వహణ ఏర్పాట్లు చేశారు.

మాధవధార: మాధవ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సాయంత్రం ఉట్టి సంబరాల్ని ఎస్ఎస్ఆర్ పార్కు ఆవరణలో చేపట్టారు. వేడుకల్లో పోర్టు అండ్ హార్బరు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అతిథిగా హాజరై బాలల్ని అభినందించారు. పార్కు కమిటీ అధ్యక్షులు ఎ.నారాయణరావు, కార్యదర్శి బి.శ్రీను, నూకరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషాలు వేసి అందరినీ అలరించారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉట్ల వేడుకలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

కంచరపాలెం: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రెడ్డికంచరపాలెం, గొల్లకంచరపాలెం,తుమ్మడిపాలెం, ఆర్పీపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.చిన్నారులు కృష్ణుని వేషధారణ ధరించి అలరించారు.సాయంకాలం ఆయా ప్రాంతాల్లో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ఇచ్చారు.

సీతంపేట: సీతంపేట కూడలిలో గల రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలతో సుందరంగా అలంకరించి తులసితో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతమ్మధార: నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి తులసి, పూల మాలలతో సుందరంగా అలంక


సీతంపేట కూడలిలో పూజలందుకుంటున్న రాధాకృష్ణులు

రించారు. ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రెడ్డి రామారావు శర్మ, మహేష్ శర్మలు శ్రీకృష్ణ భగవానుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల శ్రీకృష్ణ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్ర ఉట్టి కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సీతంపేట ప్రధాన బజార్ కూడలిలో దుర్గాగణపతి ఆలయం సమీపంలో యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యశోద కృష్ణ సేవా సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో కృష్ణాష్టమి సంబరాలు, రుక్మిణి సహిత శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని లక్ష తులసి దళలతో పూజ కార్యక్రమం, నీరాజనం, మంత్ర పుష్పములతో పూజలను శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు భాస్కర్‌శర్మ, శివాజి శర్మలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తులసి దళాలతో పూజలు చేశారు.

డాబాగార్డెన్స్: మహా నగర విశాఖ పరిధిలోని శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. మిళితనామంతో ఏకాహం చేస్తూ మరోవైపు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.బాలకృష్ణునికి ఉయ్యాల ఉత్సవం జరిపారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు బీవీ బాబాజీ, ఆర్వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, కే.మంగరాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, బి.శివసీతారామ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.విచ్చేసిన వాందరికీ అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పట్టపగలు చోరీ

» 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

» అదేబాక్సులో ఉన్న మరో 40 తులాల ఆభరణాలను విడిచిపెట్టిన దొంగలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో పట్టపగలు భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంటు సెక్టార్-6లోని 105 బి క్వార్టర్స్‌లో హెచ్‌ఆర్ విభాగం డీజీఎం ఎన్.సుందరం కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువా గడియ విరగ్గొట్టి ఉండడంతో స్టీల్‌ప్లాంటు క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లో సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఒకే బాక్సులో సుమారు 64 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆ బాక్సులో చిన్న చిన్న వస్తువులు మొత్తం 24 తులాల ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మిగతా 40 తులాలు అలాగే ఉన్నాయి. చోరీపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యారాడ ఘాట్ రోడ్డులో నక్షత్ర తాబేళ్లు లభ్యం

సింధియా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలోని యారాడ ఘాట్ రోడ్డులో శనివారం రెండు నక్షత్ర తాబేళ్లు తారసపడ్డాయి. ఆ మార్గంలో వెళుతున్నవారి ద్వారా విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి స్వాధీనం చేసుకుని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూలాజికల్ పార్కు)కు తరలించారు. జూలో 200 నక్షత్ర తాబేళ్లు ఉన్నాయని, అక్కడే ఈ రెండింటిని విడిచిపెడుతున్నట్టు తెలిపారు.


నక్షత్ర తాబేళ్లు

దంచికొట్టిన వర్షం

... 5వ పేజీ తరువాయి

పెద్దఎత్తున వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. రైల్వే న్యూకాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, జ్ఞానాపురం, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేకచోట్ల రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. నగరంలో ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెట్లు, హోర్డింగ్‌ల కింద ఉండకూడదని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

శనివారం ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకూ నగరంలో పలుచోట్ల నమోదైన వర్షపాతం వివరాలు

ప్రదేశం	మిల్లీమీటర్లు
సీతమ్మధార పంపు హౌస్	53.25
పెందుర్తి జోనల్ ఆఫీసు	45.25
పద్మనాభం	42.75
పెందుర్తి గణేష్ నగర్	42.25
సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం	39.75
భీమునిపట్నం	38

ఏయూ మాజీ రిజిస్ట్రార్‌లకు బెయిలబుల్ వారెంట్లు

... 5వ పేజీ తరువాయి

ఏయూ స్టాండింగ్ కౌన్సిల్‌కు చెందిన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ప్రస్తుత రిజిస్ట్రార్ కోర్టుకు హాజరయ్యారని, మరో ఇద్దరు వర్చువల్‌గా హాజరయ్యారని న్యాయమూర్తికి వివరించారు. అయితే కోర్టుకు నేరుగా హాజరుకావాలని చెప్పినప్పటికీ రాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి ముగ్గురు మాజీ రిజిస్ట్రార్లకు బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ ఆదేశాలిచ్చారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ, నలుగురు కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

ఆనందం మెండుగా... బస్సులు నిండుగా...

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. ఇది స్త్రీశక్తి ప్రభావమే అని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇక శ్రీకాకుళం, పలాస, టెక్కలి, మందస, పాతపట్నం, రాజాం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 80 శాతం ఆక్యుపెన్సీ తో తిరిగాయి. ఇందులో కూడా 60 శాతం జీరో టికెట్లు జారీ అయినట్టు అధికారులు తెలిపారు. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతిలు సింహాచలం, ఆర్‌కే బీచ్ రూట్లలో తనిఖీలు చేశారు. బస్సుల్లో స్వయంగా జీరో టికెట్లు జారీచేశారు. ఆధార్ కార్డును సెల్‌ఫోన్‌లో చూపించినా మహిళలకు జీరో టికెట్లు జారీ చేయాలని కండక్టర్లను ఆదేశించారు.

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు!

... 5వ పేజీ తరువాయి

వర్క్ అగ్రిమెంట్ చేసుకుని ఆర్డర్ అందజేస్తారు. ఒకసారి టెండర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే తర్వాత తొలగించడానికి అవకాశం ఉండదు. కానీ తాజాగా ఎలక్ట్రికల్ విభాగంలో ఒక పనికి సంబంధించిన టెండర్ వెబ్‌సైట్ నుంచి మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ 31వ వార్డు పరిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ క్వార్టర్స్ నుంచి లీలామహల్ జంక్షన్ మీదుగా డీమార్ట్ జంక్షన్ వరకూ వీధి దీపాలకు సంబంధించిన స్తంభాల ఏర్పాటు కోసం రూ.16.36 లక్షలతో (టెండర్ ఐడీ 834773) జోన్-3 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈనెల ఒకటిన ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ పిలిచారు. బిడ్ దాఖలుకు ఈనెల 13 మధ్యాహ్నం 3.30 గంటల వరకు గడువు ఇచ్చారు. అయితే ఆగస్టు 12 వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఆ టెండర్ కనిపించింది. 13న ఆఖరు తేదీ కావడంతో బిడ్ వేసేందుకు కాంట్రాక్టర్లు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వగా ఆ టెండర్ కనిపించలేదు. అప్పటికే ఆ టెండర్ వివరాలను ప్రింట్ తీసుకున్న కాంట్రాక్టర్లు ఐడీ నంబర్ ఆధారంగా వెతికినా కనిపించకపోవడంతో తమకు తెలిసిన వారిని సంప్రతించారు. ఆపనిలో బాగా డబ్బులు మిగిలేందుకు అవకాశం ఉండడంతో ప్రస్తుతం పిలిచిన టెండర్‌లో కొన్ని ప్రత్యేక అర్హతలు ఉండాలని షరతు విధిస్తూ తమకు అనుకూలంగా దానిని రీకాల్ చేయాలని ఒక కాంట్రాక్టర్ సంబంధిత అధికారిని కోరడంతో అలా చేసినట్టు సిబ్బంది చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి చాలా జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అస్మదీయ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారి బండారం బయటపడుతుందని చెబుతున్నారు. ఈ విషయం చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు వద్ద ప్రస్తావించగా, ఒకసారి ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పెట్టిన టెండర్‌ను తొలగించడానికి అవకాశం లేదని స్పష్టంచేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే మిగిలిన వారిలో భయం వస్తుందన్నారు.

పవర్ ప్లాంటు కూడా ప్రైవేటుకు...!

... 5వ పేజీ తరువాయి

నుంచి విద్యుత్ తీసుకోవడం మొదలైంది. దానికి నెలకు రూ.80 కోట్ల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఆ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో థర్మల్ పవర్ ప్లాంటులో 2/3వ వంతు అంటే 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ప్రైవేటుకు ఇస్తామంటూ శనివారం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఈఓఐ) ఇచ్చింది. ఈ టెండర్‌లో ఎవరైనా పాల్గొనవచ్చునని, రేటు వారే కోట్ చేయాలని పేర్కొంది. కోల్ ప్లాంటు-1, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అంతా వారే చూసుకోవాలి. కోల్ కన్వేయర్ గ్యాలరీలు, కోల్ బంకర్ గ్యాలరీలు, బాయిలర్లు, టర్బో జనరేటర్లు, యాష్ వాటర్, యాష్ హ్యాండ్లింగ్ విభాగం వంటివి వారే నిర్వహించాలి. మొత్తం 210 మెగావాట్లు ఉత్పత్తి నిర్వహణకు ఇస్తే రోజుకు కనీసం 120 మెగావాట్లు కచ్చితంగా ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఎలక్ట్రికల్ సెక్షన్ ఆపరేషన్ మొత్తం వారే చూసుకోవాలి. ఈ టెండర్ ఖరారైతే 150 మంది ఉద్యోగులను తగ్గించాల్సి వస్తుందంటున్నారు. ఇలా విభాగాల వారీగా ప్రైవేటుపరం చేస్తుండడంపై కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

భక్తిశ్రద్ధలతో దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న దుర్గాగణపతి

సీతంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవ పూజలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి హోమం చేసి దుర్గాగణపతికి పంచామృతాలు, విభూది, ఫలరసాలతో అభిషేకాలు చేపట్టారు. కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, ఆలయ ఈఓ రమాబాయిల పర్యవేక్షణలో పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కలశాలతో మహిళలు ఊరేగింపుగా బయలుదేరారు. బుద్ధి సిద్ధి సమేత వినాయకుడిని పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సారిపల్లి గోవింద్, భక్తులు పల్లకిని భుజాలపై పెట్టుకొని సీతంపేట ప్రధాన రహదారి గుండా గురుద్వార, సీతంపేట గొల్లవీధి తదితర ప్రాంతాల్లో మేళాతాళాలతో, సంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, ఉభయదేవేరులకు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు పంపిణీ చేశారు.

విద్యార్థినికి ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ అవార్డు


అవార్డు అందుకున్న కుశాంక

జ్ఞానాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థిని జి.కుశాంక చేసిన సమాజసేవ, జాతీయ స్థాయిలో సాధించిన విజయాలకు స్వాతంత్ర్య వేడుకల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయస్థాయి ఉత్తమ అవార్డు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ, డా.వీకే జయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు కుశాంకను అభినందించారు.

సర్దార్ గౌతులచ్చన్న జీవితం ఆదర్శం

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్


లచ్చన్న విగ్రహం వద్ద కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళి

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భావితరాలవారు సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. సరార్ గౌతులచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కోర్టు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశభక్తితో సత్యాగ్రహం వంటి ఎన్నో పోరాటాలు చేశారని, స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆయన జయంతి వేడుకల నిర్వహణకు అవకాశం కల్పించిన రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చన్న కుటుంబ సభ్యుడు వై.వెంకటచౌదరి, శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, బి.సి. వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, నాయకులు మన్యాల శ్రీనివాస్, అంగటి శ్రావణకుమార్, శ్రీశయన, శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్ : బడుగు, బలహీనవర్గాల ఆరాధ్యదైవం సర్దార్ గౌతు లచ్చన్న అని ఆంధ్రప్రదేశ్ బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పోలాకి శ్రీనివాసరావు కొనియాడారు.శనివారం గ్రీన్‌పార్కు హోటల్ కూడలిలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు సర్దార్ లచ్చన్న 116వ జయంతి వేడుకల సందర్భంగా లచ్చన్న విగ్రహానికి పలువురు బీసీనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమయంలో ఎనలేని సేవలందించారన్నారు.బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత కూడా రాజకీయాలను వారు తీవ్రంగా ప్రభావితం చేశారన్నారు.సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బురిడీ కల్యాణి మాట్లాడుతూ బడుగు వర్గాలకు దేవాలయం ప్రవేశం కల్పించడం కోసం, హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ వారికి ఆలయ ప్రవేశం కల్పించారన్నారు.అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే.లక్ష్మణమూర్తి మాట్లాడుత మహానాయకుని జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించడం అభిందనీయమన్నారు.ఈకార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

'దళితుల ఐక్యతపై బీజేపీ కుట్ర'


సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

డాబాగార్డెన్స్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ పేరుతో మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ఆరోపించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భాగస్వామిగా ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు మాల సామాజికవర్గాన్ని చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. అపూర్వ సహోదరులుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి మాల సామాజికవర్గంపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. కులాన్ని,మతాన్ని రెచ్చగొట్టి దేశాన్ని విభజించి, అమ్ముకునే పనిలో మోదీ, ఆయన గుజరాతీ పరివారం ఉందన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోదీ నిర్వీర్యం చేశారన్నారు. దమ్ముంటే బ్యాలెట్ పేపర్‌తో గెలిచి తన సామర్థ్యాన్ని బీజేపీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఎస్సీ వర్గీకరణ తప్పు అని, దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో సవరణ చేసే వరకు నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వివిధ దశల్లో శాంతియుత పోరాటం చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గొల్ల ఈశ్వరరావు, మత్తి రత్నారావు, గొడుగు రాజు, సిమ్మాల దుర్గాప్రసాద్, శ్యామలరావు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో మల్టీపారా మానిటర్స్ యూనిట్


యూనిట్ ప్రారంభోత్సవంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలకు ఉపయోగపడే మల్టీపారా మానిటర్స్ యూనిట్‌ను తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రికి విరాళంగా అందజేసింది. దీనిని శనివారం డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జోత్స్న బొహ్రా ప్రారంభించారు. అనంతరం ఈకార్వో సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, పోషక పదార్థాలు, ఆరోగ్య పానీయాలు అందజేశారు. వారితో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, పర్యవేక్షణ అందించేందుకు మల్టీపారా మానిటర్స్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని జోత్స్న బొహ్రా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు పాల్గొన్నారు.

యాచకులు, నిరాశ్రయులకు ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ, ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో 77 మంది యాచకులు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన యాచక రహిత నగరం (బెగ్గింగ్ ఫ్రీ సిటీ) కార్యక్రమం ద్వారా పోలీసులు రెస్క్యూ చేసి 243 మంది యాచకులలో మానసిక రోగులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు మొత్తం 77 మందికి టీఎస్సార్ కాంప్లెక్స్, భీమ్‌నగర్ షెల్టర్లలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరందరికీ మూడు పూటలా భోజన సదుపాయం, వైద్యం అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 8 మంది మగవారు, ముగ్గురు మహిళలను వారి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో అప్పగించినట్లు చెప్పారు.


షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

భావాలు స్పష్టంగా చెప్పాలంటే మాతృభాష తప్పనిసరి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

సీతంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భావాలను స్పష్టంగా చెప్పాలంటే మాతృభాష తప్పనిసరి అని, తెలుగు తనకు ఇష్టమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన బాలబాట, బాలల మాసపత్రిక 18వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. రచయిత్రి, బాలబాట పత్రికా సంపాదకురాలు కొల్లూరి స్వరాజ్యం వెంకట రమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ కొందరు తెలుగువారే కొన్ని తెలుగు పదాలు చెప్పలేక పోతున్నారన్నారు. తెలుగు, బాలల పత్రికలను నడుపుతున్న రమణమ్మను అభినందించారు. మరో అతిథిగా విచ్చేసిన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు మాస్త్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు బాలసాహిత్యంపై పుస్తకాలు తక్కువగా వస్తున్నాయన్నారు. పిల్లలకు పఠనాసక్తిని కలిగించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ విలువలు కోల్పోతున్న ఈ రోజుల్లో సృజనాత్మకత కలిగించేందుకు బాల సాహిత్యం అవసరమన్నారు. ఈ సభలో ద్వాదశి రామలక్ష్మి రచించిన బాల గేయమాలిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళావేదిక విశాఖ అధ్యక్షుడు కె.రామజగన్నాథ, న్యాయవాది ఉప్పల అనిల్‌కుమార్, యువ చిత్రకారుడు శశాంక, కవి, రచయిత తెప్పల కృష్ణమూర్తి, చిద్విలాస్, భవ్యశ్రీ పాల్గొన్నారు.


ఎంవీపీ కాలనీ : పూజల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరీంధిరప్రసాద్


ఎంవీపీ కాలనీ : అలంకరణలో రాధాకృష్ణులు


వెంకోజీపాలెం : ఇసుకతోట శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయిదుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

» కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు
» బాలకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు
» పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా ఉట్టి ఉత్సవాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పరిసరాలు హరేకృష్ణ నామస్మరణతో మార్మోగాయి. భక్తుల రద్దీతో రహదారులు కిక్కిరిశాయి. హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలతో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజైన శనివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

నగరంలోని ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హరీంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు. బాలగోపాల్, రాధామదనమోహన్ విగ్రహాలకు ప్రాతఃకాల అభిషేకం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు డాక్టర్ నిష్కించిన భక్త దాస పూజలను ప్రారంభించారు. సప్తనదుల నుంచి సేకరించిన జలాలతో ఉదయం అభిషేకం చేశారు. కళాకారులు ద్వారం త్యాగరాజ్ బృందం, చైతన్య బ్రదర్స్, డాక్టర్ సరస్వతి విద్యార్థుల బృందం, గట్టి శ్రీవిద్య, విద్యాధరి మ్యూజిక్ స్కూల్ బృందాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సుమారు 5 వేల మంది భక్తులు బాలగోపాలుడిని దర్శించుకున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉట్టి కొట్టే మహోత్సవంలో చిన్నారులు, యువత భారీగా పాల్గొన్నారు. కృష్ణతో సెల్ఫీ వంటి అనేక ఆటల పోటీల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారీ ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఉదయం పది నుంచి ఒంటి గంట వరకూ, సాయంత్రం 5 నుంచి 9 వరకూ భక్తులు దర్శనం చేసుకున్నారు. మహా అభిషేకం, మంగళ హారతి నిర్వహించారు. 108 పవిత్ర జల కలశాలు, పండ్ల రసాలు, పంచామృతం, పంచంగవ్యాలు, వివిధ పుష్పాలతో మహాభిషేకం నిర్వహించారు. దర్శనానికి కుటుంబ సమేతంగా వచ్చిన వారు తమ చిన్నారులను రాధ, చిన్నికృష్ణుల వేషధారణలో తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక ఆచార్య భక్తి వేదాంతస్వామి ఆవిర్భావ దినోత్సం సందర్భంగా వెయ్యి రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించనున్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : 'జైకృష్ణ.. జైజై కృష్ణా..' అంటూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కృష్ణుడు, గోపికల వేషదారిణలో చిన్నారులు అలంకరించుకుని వీధుల్లో సందడి చేశారు. వివిధ యాదవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసుకతోటలోని శ్రీమురళీకృష్ణ జ్ఞాన మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల వేడుకగా నిర్వహించారు. కృష్ణ భగవానుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు బారులు తీరారు. సుందరసత్సంగ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మందిరంలో కృష్ణాష్టమినిపురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. తులాభారం, గోపూజ, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు ఆది వారం చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్సంగ్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, సాంబమూర్తిరాజు, ఆలయ ప్రధానార్చకులు కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 16వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఇక్కడి సామాజిక భవనంలో కృష్ణుడి ప్రతిమను ఉంచి పూజలు నిర్వహించన్నట్టు సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాల రాజు తెలిపారు. ఆదివారం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపడతామని, సోమవారం స్వామివారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇసుకతోటలో...

ఇసుకతోటలోని శ్రీకృష్ణఉమామహేశ్వర సాయిదుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా పాల్గొని స్వామివారిని కొలిచారు. ఈ సందర్భంగా కృష్ణ భగవానుడికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపీకృష్ణ, కోశాధికారి గొలగాని రాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రరావు, సహాయ కార్యదర్శి ముగడ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఈగల రమణ, ఒమ్మి గోపీనాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్, ప్రచార కార్యదర్శి ఉప్పిలి కృష్ణంనాయుడు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల పాత ఆరిలోవలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీయశోదాబాలగోపాల్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి అత్యంత ఇష్టమైన వెన్నను నైవేద్యంగా నిర్వాహకులు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి సందర్భంగా పెదగదిలిలో గల శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఉట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీ కృష్ణ వేషధారణలో మోహిత్ ఎంతగానో ఆకట్టుకున్నాడు, కార్యక్రమంలో భాగంగా సంఘ అధ్యక్షుడు ఒమ్మి వెంకటఅప్పారావు, ప్రతినిధి ధూళి రఘు బొట్ట రమణ తదితరలు పాల్గొన్నారు, అలాగే సాలిపేటలో బాలమురళి సంఘం ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవ సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఒమ్మి పోలారావు, ఒమ్మి మోహన్, బొట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు పీతలవానిపాలెంలోని రాధాకృష్ణ మందిరంలో శనివారం శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడుకి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు చిన్నికృష్ణుడి వేషధారణతో మురిపించారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. స్వామి వారి ఆలయంలో భజనలు చేసి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, గ్రామపెద్దలు పెసల శ్రీను, సత్యం, పీతల గోవింద్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆరిలోవ : 11వ వార్డులోని పాత ఆరిలోవలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర


మద్దిలపాలెం : శ్రీకృష్ణుడుకి పూజలు చేస్తున్న భక్తులు


ఎంవీపీ కాలనీ : చిన్నికృష్ణుడి ఉట్టి సంబరం

ఉత్సాహంగా తిరంగా ఫ్యాషన్ కిడ్స్ వాక్


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా

సిరిపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎరీనా థియేటర్‌లో నిభాంగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తిరంగ్ ఫ్యాషన్ కిడ్స్‌వాక్ అలరించింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో చురుకుదనం, తద్వారా ఆరోగ్యం వంటివి పెంపొందించవచ్చన్నారు. నిభాంగ్ ప్రతినిధి పి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేశభక్తికి చెందిన కార్యక్రమాలను చేపడుతున్నామని, విశాఖలో ఈ కార్యక్రమాన్ని రెండోసారి చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ పతకాలు సాధించిన రుషిల్‌బెండీని సత్కరించారు. కె.కిరణ్‌కుమార్, బి.నిరుపమ్, వి.వింధ్య తదితరులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.


చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

17న 'ఘంటసాల ది గ్రేట్' చిత్రం ప్రివ్యూ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల జీవితాన్ని ఆధారంగా మాజీ పోలీసు అధికారి సీహెచ్ రామారావు తెరకెక్కించిన ఘంటసాల ది గ్రేట్ ప్రీ రివ్యూ షో ఈ నెల 17న ఉదయం 8 గంటలకు శ్రీ రామ టాకీస్‌లో ప్రదర్శించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ చిత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాఖ గాయనీగాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జయహో ఇండియా' పాట ఆవిష్కరణ



జయహో ఇండియా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నరవ ప్రకాశరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తిని పెంపొందించడానికి, యువతను ఉత్తేజ పరచడానికి నిర్మించిన జయహో ఇండియా వీడియో పాటను ప్రముఖ సంఘ సేవకుడు నరవ ప్రకాశరావు లాసన్స్‌బేకాలనీలో ఆవిష్కరించారు. ప్రస్తుత తరాలకు అప్పటి స్వాతంత్ర్య సమరయోధుల అంశాలను పొందుపరచిన వీడియో ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎం నాయుడు, న్యాయవాది ఎన్ రఘురాం, శివశ్రీ మీగడ, దీప్తి మీగడ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలుగా నిర్మాణ వ్యర్థాలు


కేడీపీఎం స్కూల్ రహదారి పక్కన వ్యర్థాలు

పెదవాల్తేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఈస్టు పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్ ఎదురుగా రహదారి పక్కన పలుచోట్ల భవననిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా వేస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రుళ్ళు జన సంచారం తక్కువగా ఉండడం చూసి కొంత మంది లారీలు, ఆటోలలో గుట్టలుగా వ్యర్థా లు తీసుకొచ్చి పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో ఈ వ్యర్థాలలో పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయని, వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని, దీనివల్ల వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ, పోలీసు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

18వ వార్డులో తాగునీటి బోరు ప్రారంభం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని అప్పుఘర్ శ్రీరాములవారి ఆలయం సమీపంలో మంచి నీటి బోరును కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు ప్రారంభించారు. ఈ బోరువెల్ అందుబాటులోకి రావడంతో సమీపంలో నీటి ఎద్దడి నివారణకు ఉపయోగపడుతుందని కార్పొరేటర్ అన్నారు.

కార్యక్రమంలో తెదేపా నాయకులు కారి రామారావు, సీతారామయ్య, కోడా గురయ్య, సింహాద్రి, కుల పెద్ద సీతారామయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2 : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)**
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24,బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు(కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోట కూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఈవో వేంద్ర తినాథరావు తెలిపారు. శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మూడు బ్యాచ్‌లతో వ్రతాలు నిర్వహి స్తామని చెప్పారు. ఆసక్తి గల భక్తులు కొండపై పీఆర్‌వో కార్యాలయంలో ఆధార్‌కార్డు చూపించి, పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారిని మాత్రమే అనుమతిస్తా మన్నారు. పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానం సమకూరుస్తుందని, కొండపైకి రాకపోకలు సాగించడానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వరలక్ష్మీ వ్రతాలు నేపథ్యంలో ఆ రోజు జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈవో ప్రకటించారు.

వర్షాలతో చిరు వ్యాపారుల ఇబ్బందులు

ఆరిలోవ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులనుంచి ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఆరిలోవ పరిసర ప్రాంతాలు చిత్తడిగా తయారయ్యాయి. రోడ్లు బురద మయంగా మారాయి. చిరు జల్లుల వల్ల సాయంత్రం వ్యాపారాలు నిర్వహించుకునే తినుబండారాల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల వల్ల వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు వాపోయారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు స్ఫూర్తిదాయకం

» విశాఖ జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు


లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న వాసుదేవరావు, సంఘ సభ్యులు

రామ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల కోసం సర్దార్ గౌతులచ్చన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖ జిల్లా శ్రీశయన కుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా గ్రీన్ పార్కు రోడ్డులో ఉన్న లచ్చన్న విగ్రహానికి శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతులచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించ డం అబినందనీయమన్నారు. పలాస కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విశాఖ జిల్లాలో స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ప్రసాద్, తోట శేఖర్, బొంగు సత్తిరాజు, గడ్డి తిరుపతిరావు, తోట హరికృష్ణ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కూటమివి సూపర్ డూపర్ ఫ్లాప్ పథకాలు

» ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


విలేకరులతో మాట్లాడుతున్న కల్యాణి

మద్దిలపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ డూపర్ ఫ్లాప్ అయ్యాయని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం కాదు స్త్రీకి వంచన పథకమని విమర్శించారు. రాష్ట్రంలో 11 రకాల బస్సులు ఉంటే 5 రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణానికి ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల మహిళలకు ఏ బస్సులో ప్రయాణంలో చేస్తే టిక్కెట్ ఉండదో తెలియని పరిస్థితి నెలకొంటోందన్నారు. ఇది ఉచిత బస్సు ప్రయాణం కాదని, ఉచిత బోగస్ ప్రయాణమని ఎద్దేవా చేవారు. తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టారన్నారు. వివిధ ఆంక్షలు నిబంధనలు పెట్టి 30 లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టారన్నారు.

నేడు భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల గృహాలకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్లుగా భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు కంటున్న కలలు ఆదివారం నిజం కానున్నాయి. సొసైటీ సభ్యుల గృహాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరగనున్నది. దీంతో 360 మంది సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి సొసైటీ పాలకవర్గం 360 మంది సభ్యులకు సొంతిళ్ల నిర్మించాలని సాలాపువానిపాలెం సమీపంలో 36 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది.

విపత్తు నిర్వహణకు జీవీఎంసీ అప్రమత్తం

» అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆదేశం
» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలు, గాలివానలు, వడగళ్ల వాన వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీ అన్ని విభాగాలు తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో పలు చోట్లవర్షాలు అధికంగా కురుస్తున్నాయని, మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న సమాచారంతో ఇప్పటికే జీవీఎంసీ అప్రమత్తతో ముందస్తుగా ప్రత్యేక చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలోనున్న భవనాలను గుర్తించి నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేశామని తెలిపారు. నగరంలో డ్రైనేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్ అధికంగా నీరు ప్రవహించే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, అలాగే నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసినట్టు చెప్పారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున నగరంలో శిథిలావస్థలోనున్న హోర్డింగులను గుర్తించి వాటిని వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలని, అగ్ని ప్రమాదాలు సంభవించినట్టయితే ప్రజల రక్షణ దిశగా జీవీఎంసీ రీజనల్ అగ్నిమాపక అధికారి తగు చర్యలు చేపడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జీవీఎంసీ వాహనాలు, జనరేటర్లు, చెట్లను తొలగించే యంత్రాలు, ఎక్సకవేటర్లు, ట్రక్కులు, ఇంధనం, సమాచార రేడియో హ్యాండ్ సెట్‌లను వంటి అవసరమగు పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. అలాగే జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని రక్షణ చర్యల చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


గీతాభవన్‌లో శ్రీకృష్ణునికి అలంకరణ


గణేష్‌నగర్‌లో తులసీమాలలతో కృష్ణునికి పూజలు


సీతంపేటలో వేణుగోపాలుడు


మురళీనగర్‌లో చిన్నారులతో పార్కు కమిటీ సభ్యులు

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వన్‌టౌన్ శ్రీ గీతాభవన్‌లో శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తికి మంగళధ్వని, వేద మంత్రాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం తులసి అర్చన ఉట్టికొట్టే సంబరం, ఉయ్యాల ఉత్సవం, శ్రీకృష్ణ వేషధారణ దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.వనజాదేవి, జి.వి.ఆర్.ప్రసాద్, లక్ష్మీనరసింహ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మురళీనగర్: వైశాఖీ స్పోర్ట్స్ పార్కు ఆవరణలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం భగవద్గీత పారాయణం, సంప్రదాయ నృత్యాల మధ్య కోలాహలంగా ఉట్ల సంబరాన్ని చేపట్టారు. స్థానిక యువత, చిన్నారులు, మహిళలు ఉత్సవంలో పాల్గొన్నారు. పార్కు కమిటీ ప్రెసిడెంట్ ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో శ్రీ కృష్ణ భక్త బృందం చేపట్టిన కీర్తనలు ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణుని పూజా కార్యక్రమాలు, ఉత్సవ ప్రత్యేక దర్శనాల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు పండుగ నిర్వహణ ఏర్పాట్లు చేశారు.

మాధవధార: మాధవ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. సాయంత్రం ఉట్టి సంబరాల్ని ఎస్ఎస్ఆర్ పార్కు ఆవరణలో చేపట్టారు. వేడుకల్లో పోర్టు అండ్ హార్బరు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అతిథిగా హాజరై బాలల్ని అభినందించారు. పార్కు కమిటీ అధ్యక్షులు ఎ.నారాయణరావు, కార్యదర్శి బి.శ్రీను, నూకరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషాలు వేసి అందరినీ అలరించారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉట్ల వేడుకలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

కంచరపాలెం: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రెడ్డికంచరపాలెం, గొల్లకంచరపాలెం,తుమ్మడిపాలెం, ఆర్పీపేట తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.చిన్నారులు కృష్ణుని వేషధారణ ధరించి అలరించారు.సాయంకాలం ఆయా ప్రాంతాల్లో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ఇచ్చారు.

సీతంపేట: సీతంపేట కూడలిలో గల రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలతో సుందరంగా అలంకరించి తులసితో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతమ్మధార: నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి తులసి, పూల మాలలతో సుందరంగా అలంకరించారు.


సీతంపేట కూడలిలో పూజలందుకుంటున్న రాధాకృష్ణులు

ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రెడ్డి రామారావు శర్మ, మహేష్ శర్మలు శ్రీకృష్ణ భగవానుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల శ్రీకృష్ణ మందిరంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్ర ఉట్టి కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సీతంపేట ప్రధాన బజార్ కూడలిలో దుర్గాగణపతి ఆలయం సమీపంలో యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యశోద కృష్ణ సేవా సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో కృష్ణాష్టమి సంబరాలు, రుక్మిణి సహిత శ్రీకృష్ణ పరమాత్ముడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని లక్ష తులసి దళలతో పూజ కార్యక్రమం, నీరాజనం, మంత్ర పుష్పములతో పూజలను శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు భాస్కర్‌శర్మ, శివాజి శర్మలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తులసి దళాలతో పూజలు చేశారు.

డాబాగార్డెన్స్: మహా నగర విశాఖ పరిధిలోని శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. మిళితనామంతో ఏకాహం చేస్తూ మరోవైపు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.బాలకృష్ణునికి ఉయ్యాల ఉత్సవం జరిపారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు బీవీ బాబాజీ, ఆర్వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, కే.మంగరాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, బి.శివసీతారామ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.విచ్చేసిన వారందరికీ అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న దుర్గాగణపతి

సీతంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవ పూజలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి హోమం చేసి దుర్గాగణపతికి పంచామృతాలు, విభూది, ఫలరసాలతో అభిషేకాలు చేపట్టారు. కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, ఆలయ ఈఓ రమాబాయిల పర్యవేక్షణలో పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కలశాలతో మహిళలు ఊరేగింపుగా బయలుదేరారు. బుద్ధి సిద్ధి సమేత వినాయకుడిని పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సారిపల్లి గోవింద్, భక్తులు పల్లకిని భుజాలపై పెట్టుకొని సీతంపేట ప్రధాన రహదారి గుండా గురుద్వార, సీతంపేట గొల్లవీధి తదితర ప్రాంతాల్లో మేళతాళాలతో, సంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

సింహాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులకు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు పంపిణీ చేశారు.

విద్యార్థినికి ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ అవార్డు


అవార్డు అందుకున్న కుశాంక

జ్ఞానాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థిని జి.కుశాంక చేసిన సమాజసేవ, జాతీయ స్థాయిలో సాధించిన విజయాలకు స్వాతంత్ర్య వేడుకల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయస్థాయి ఉత్తమ అవార్డు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ, డా.వీకే జయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు కుశాంకను అభినందించారు.

సర్దార్ గౌతులచ్చన్న జీవితం ఆదర్శం

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భావితరాలవారు సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. సరార్ గౌతులచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కోర్టు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశభక్తితో సత్యాగ్రహం వంటి ఎన్నో పోరాటాలు చేశారని, స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆయన జయంతి వేడుకల నిర్వహణకు అవకాశం కల్పించిన రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చన్న కుటుంబ సభ్యుడు వై.వెంకటచౌదరి, శాసన సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, బి.సి. వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, నాయకులు మన్యాల శ్రీనివాస్, అంగటి శ్రావణకుమార్, శ్రీశయన, శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్ : బడుగు, బలహీనవర్గాల ఆరాధ్యదైవం సర్దార్ గౌతు లచ్చన్న అని ఆంధ్రప్రదేశ్ బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పోలాకి శ్రీనివాసరావు కొనియాడారు.శనివారం గ్రీన్‌పార్కు హోటల్ కూడలిలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు సర్దార్ లచ్చన్న 116వ జయంతి వేడుకల సందర్భంగా లచ్చన్న విగ్రహానికి పలువురు బీసీనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమయంలో ఎనలేని సేవలందించారన్నారు.బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత కూడా రాజకీయాలను వారు తీవ్రంగా ప్రభావితం చేశారన్నారు.సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బురిడీ కల్యాణి మాట్లాడుతూ బడుగు వర్గాలకు దేవాలయం ప్రవేశం కల్పించడం కోసం, హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ వారికి ఆలయ ప్రవేశం కల్పించారన్నారు.అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే.లక్ష్మణమూర్తి మాట్లాడుత మహానాయకుని జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించడం అభిందనీయమన్నారు.ఈకార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.


లచ్చన్న విగ్రహం వద్ద కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళి

'దళితుల ఐక్యతపై బీజేపీ కుట్ర'


సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

డాబాగార్డెన్స్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ పేరుతో మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ఆరోపించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భాగస్వామిగా ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు మాల సామాజికవర్గాన్ని చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. అపూర్వ సహోదరులుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి మాల సామాజికవర్గంపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. కులాన్ని,మతాన్ని రెచ్చగొట్టి దేశాన్ని విభజించి, అమ్ముకునే పనిలో మోదీ, ఆయన గుజరాతీ పరివారం ఉందన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోదీ నిర్వీర్యం చేశారన్నారు. దమ్ముంటే బ్యాలెట్ పేపర్‌తో గెలిచి తన సామర్థ్యాన్ని బీజేపీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఎస్సీ వర్గీకరణ తప్పు అని, దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో సవరణ చేసే వరకు నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వివిధ దశల్లో శాంతియుత పోరాటం చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గొల్ల ఈశ్వరరావు, మత్తి రత్నారావు, గొడుగు రాజు, సిమ్మాల దుర్గాప్రసాద్, శ్యామలరావు, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో మల్టీపారా మానిటర్స్ యూనిట్


యూనిట్ ప్రారంభోత్సవంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలకు ఉపయోగపడే మల్టీపారా మానిటర్స్ యూనిట్‌ను తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) వాల్తేరు రైల్వే ప్రధాన ఆసుపత్రికి విరాళంగా అందజేసింది. దీనిని శనివారం డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఈకార్వో అధ్యక్షురాలు జోత్న బొహ్రా ప్రారంభించారు. అనంతరం ఈకార్వో సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, పోషక పదార్థాలు, ఆరోగ్య పానీయాలు అందజేశారు. వారితో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, పర్యవేక్షణ అందించేందుకు మల్టీపారా మానిటర్స్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని జోత్న బొహ్రా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు పాల్గొన్నారు.

యాచకులు, నిరాశ్రయులకు ఆశ్రయం

అక్కయ్యపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ, ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో 77 మంది యాచకులు, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన యాచక రహిత నగరం (బెగ్గింగ్ ఫ్రీ సిటీ) కార్యక్రమం ద్వారా పోలీసులు రెస్క్యూ చేసి 243 మంది యాచకులలో మానసిక రోగులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు మొత్తం 77 మందికి టీఎస్సార్ కాంప్లెక్స్, భీమ్‌నగర్ షెల్టర్లలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరందరికీ మూడు పూటలా భోజన సదుపాయం, వైద్యం అందించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 8 మంది మగవారు, ముగ్గురు మహిళలను వారి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో అప్పగించినట్లు చెప్పారు.


షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులు

భావాలు స్పష్టంగా చెప్పాలంటే మాతృభాష తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

సీతంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భావాలను స్పష్టంగా చెప్పాలంటే మాతృభాష తప్పనిసరి అని, తెలుగు తనకు ఇష్టమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన బాలబాట, బాలల మాసపత్రిక 18వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. రచయిత్రి, బాలబాట పత్రికా సంపాదకురాలు కొల్లూరి స్వరాజ్యం వెంకట రమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ కొందరు తెలుగువారే కొన్ని తెలుగు పదాలు చెప్పలేక పోతున్నారన్నారు. తెలుగు, బాలల పత్రికలను నడుపుతున్న రమణమ్మను అభినందించారు. మరో అతిథిగా విచ్చేసిన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు బాలసాహిత్యంపై పుస్తకాలు తక్కువగా వస్తున్నాయన్నారు. పిల్లలకు పఠనాసక్తిని కలిగించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ విలువలు కోల్పోతున్న ఈ రోజుల్లో సృజనాత్మకత కలిగించేందుకు బాల సాహిత్యం అవసరమన్నారు. ఈ సభలో ద్వాదశి రామలక్ష్మి రచించిన బాల గేయమాలిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళావేదిక విశాఖ అధ్యక్షుడు కె.రామజగన్నాథ, న్యాయవాది ఉప్పల అనిల్‌కుమార్, యువ చిత్రకారుడు శశాంక, కవి, రచయిత తెప్పల కృష్ణమూర్తి, చిద్విలాస్, భవ్యశ్రీ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పట్టపగలు చోరీ

» 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

» అదేబాక్సులో ఉన్న మరో 40 తులాల ఆభరణాలను విడిచిపెట్టిన దొంగలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో పట్టపగలు భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంటు సెక్టార్-6లోని 105 బి క్వార్టర్స్‌లో హెచ్‌ఆర్ విభాగం డీజీఎం ఎన్.సుందరం కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువా గడియ విరగ్గొట్టి ఉండడంతో స్టీల్‌ప్లాంటు క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లో సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఒకే బాక్సులో సుమారు 64 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆ బాక్సులో చిన్న చిన్న వస్తువులు మొత్తం 24 తులాల ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. మిగతా 40 తులాలు అలాగే ఉన్నాయి. చోరీపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యారాడ ఘాట్ రోడ్డులో నక్షత్ర తాబేళ్లు లభ్యం


నక్షత్ర తాబేళ్లు

సింధియా, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలోని యారాడ ఘాట్ రోడ్డులో శనివారం రెండు నక్షత్ర తాబేళ్లు తారసపడ్డాయి. ఆ మార్గంలో వెళుతున్నవారి ద్వారా విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి స్వాధీనం చేసుకుని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూలాజికల్ పార్కు)కు తరలించారు. జూలో 200 నక్షత్ర తాబేళ్లు ఉన్నాయని, అక్కడే ఈ రెండింటిని విడిచిపెడుతున్నట్టు తెలిపారు.

దంచికొట్టిన వర్షం

... 5వ పేజీ తరువాయి

పెద్దఎత్తున వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. రైల్వే న్యూకాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, జ్ఞానాపురం, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేకచోట్ల రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. నగరంలో ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెట్లు, హోర్డింగ్‌ల కింద ఉండకూడదని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

శనివారం ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకూ నగరంలో పలుచోట్ల నమోదైన వర్షపాతం వివరాలు

ప్రదేశం	మిల్లీమీటర్లు
సీతమ్మధార పంపు హౌస్	53.25
పెందుర్తి జోనల్ ఆఫీసు	45.25
పద్మనాభం	42.75
పెందుర్తి గణేష్ నగర్	42.25
సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయం	39.75
భీమునిపట్నం	38

ఏయూ మాజీ రిజిస్ట్రార్‌లకు బెయిలబుల్ వారెంట్లు

... 5వ పేజీ తరువాయి

ఏయూ స్టాండింగ్ కౌన్సిల్‌కు చెందిన న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ ప్రస్తుత రిజిస్ట్రార్ కోర్టుకు హాజరయ్యారని, మరో ఇద్దరు వర్చువల్‌గా హాజరయ్యారని న్యాయమూర్తికి వివరించారు. అయితే కోర్టుకు నేరుగా హాజరుకావాలని చెప్పినప్పటికీ రాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి ముగ్గురు మాజీ రిజిస్ట్రార్లకు బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ ఆదేశాలిచ్చారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తూ, నలుగురు కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

ఆనందం మెండుగా... బస్సులు నిండుగా...

... 5వ పేజీ తరువాయి

నమోదయ్యింది. ఇది స్త్రీశక్తి ప్రభావమే అని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇక శ్రీకాకుళం, పలాస, టెక్కలి, మందస, పాతపట్నం, రాజాం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 80 శాతం ఆక్యుపెన్సీ తో తిరిగాయి. ఇందులో కూడా 60 శాతం జీరో టికెట్లు జారీ అయినట్టు అధికారులు తెలిపారు. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతిలు సింహాచలం, ఆర్కే బీచ్ రూట్లలో తనిఖీలు చేశారు. బస్సుల్లో స్వయంగా జీరో టికెట్లు జారీచేశారు. ఆధార్ కార్డును సెల్‌ఫోన్‌లో చూపించినా మహిళలకు జీరో టికెట్లు జారీ చేయాలని కండక్టర్లను ఆదేశించారు.

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు!

... 5వ పేజీ తరువాయి

వర్క్ అగ్రిమెంట్ చేసుకుని ఆర్డర్ అందజేస్తారు. ఒకసారి టెండర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే తర్వాత తొలగించడానికి అవకాశం ఉండదు. కానీ తాజాగా ఎలక్ట్రికల్ విభాగంలో ఒక పనికి సంబంధించిన టెండర్ వెబ్‌సైట్ నుంచి మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ 31వ వార్డు పరిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ క్వార్టర్స్ నుంచి లీలామహల్ జంక్షన్ మీదుగా డీమార్ట్ జంక్షన్ వరకూ వీధి దీపాలకు సంబంధించిన స్తంభాల ఏర్పాటు కోసం రూ.16.36 లక్షలతో (టెండర్ ఐడీ 834773) జోన్-3 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈనెల ఒకటిన ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ పిలిచారు. బిడ్ దాఖలుకు ఈనెల 13 మధ్యాహ్నం 3.30 గంటల వరకు గడువు ఇచ్చారు. అయితే ఆగస్టు 12 వరకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో ఆ టెండర్ కనిపించింది. 13న ఆఖరు తేదీ కావడంతో బిడ్ వేసేందుకు కాంట్రాక్టర్లు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వగా ఆ టెండర్ కనిపించలేదు. అప్పటికే ఆ టెండర్ వివరాలను ప్రింట్ తీసుకున్న కాంట్రాక్టర్లు ఐడీ నంబర్ ఆధారంగా వెతికినా కనిపించకపోవడంతో తమకు తెలిసిన వారిని సంప్రతించారు. ఆపనిలో బాగా డబ్బులు మిగిలేందుకు అవకాశం ఉండడంతో ప్రస్తుతం పిలిచిన టెండర్‌లో కొన్ని ప్రత్యేక అర్హతలు ఉండాలని షరతు విధిస్తూ తమకు అనుకూలంగా దానిని రీకాల్ చేయాలని ఒక కాంట్రాక్టర్ సంబంధిత అధికారిని కోరడంతో అలా చేసినట్టు సిబ్బంది చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి చాలా జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అస్మదీయ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారి బండారం బయటపడుతుందని చెబుతున్నారు. ఈ విషయం చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు వద్ద ప్రస్తావించగా, ఒకసారి ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పెట్టిన టెండర్‌ను తొలగించడానికి అవకాశం లేదని స్పష్టంచేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటే మిగిలిన వారిలో భయం వస్తుందన్నారు.

పవర్ ప్లాంటు కూడా ప్రైవేటుకు...!

... 5వ పేజీ తరువాయి

నుంచి విద్యుత్ తీసుకోవడం మొదలైంది. దానికి నెలకు రూ.80 కోట్ల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఆ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో థర్మల్ పవర్ ప్లాంటులో 2/3వ వంతు అంటే 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ప్రైవేటుకు ఇస్తామంటూ శనివారం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఈఓఐ) ఇచ్చింది. ఈ టెండర్‌లో ఎవరైనా పాల్గొనవచ్చునని, రేటు వారే కోట్ చేయాలని పేర్కొంది. కోల్ ప్లాంటు-1, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అంతా వారే చూసుకోవాలి. కోల్ కన్వేయర్ గ్యాలరీలు, కోల్ బంకర్ గ్యాలరీలు, బాయిలర్లు, టర్బో జనరేటర్లు, యాష్ వాటర్, యాష్ హ్యాండ్లింగ్ విభాగం వంటివి వారే నిర్వహించాలి. మొత్తం 210 మెగావాట్లు ఉత్పత్తి నిర్వహణకు ఇస్తే రోజుకు కనీసం 120 మెగావాట్లు కచ్చితంగా ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఎలక్ట్రికల్ సెక్షన్ ఆపరేషన్ మొత్తం వారే చూసుకోవాలి. ఈ టెండర్ ఖరారైతే 150 మంది ఉద్యోగులను తగ్గించాల్సి వస్తుందంటున్నారు. ఇలా విభాగాల వారీగా ప్రైవేటుపరం చేస్తుండడంపై కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



వాజపేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

వాజపేయికి ఘన నివాళి

గాజువాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి వాజపేయి సేవలు ఎనలేనివని గాజువాక బీజేపీ నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, దీనంకొండ కృష్ణంరాజు అన్నారు. శనివారం వాజపేయి వర్ధంతి సందర్భంగా గాజువాక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజల సంక్షేమానికి వాజపేయి విశేష కృషి చేశారని వారు కొనియాడారు. జాతీయ రహదారుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

అప్పన్న మెమోరియల్ క్లబ్

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68 వార్డు మింది కాలనీలోని గుడివాడ అప్పన్న మెమోరియల్ క్లబ్ సభ్యులు శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా గుడివాడ అప్పలరాజు, అధ్యక్షుడిగా పైడా ప్రకాశరావు, ఉపాధ్యక్షుడిగా అట్టా బ్రహ్మానందరావు, సీహెచ్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా వి.వెంటరావు, సహాయ కార్యదర్శులుగా గుడివాడ రాజశేఖర్, వి.ఆకాశరావు, కోశాధికారిగా వెంకటరావు ఎన్నికయ్యారు.

ఆటో వర్కర్స్ యూనియన్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ మరిడిమాంబ అమ్మవారి ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. గౌరవఅధ్యక్షుడిగా, రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోటంటి లెనిన్ బాబు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా బడిసెల.సన్నీ, ఉపాధ్యక్షుడిగా చీపురుపల్లి త్రినాథ్, కార్యదర్శిగా చిట్టిబోయిన అప్పలరాజు, కోశాధికారిగా శ్రీనులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డులో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు చెందిన భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఆలయంలో సాయంత్రం కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. కృష్ణుని అవతారంలో ఉన్న వెంకటేశ్వర స్వామిక భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

సినిమా గైడ్

- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 18, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 22, బీరకాయలు 28, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 70, బరబాటి 30, నిమ్మకాయలు (కిలో) 64, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 58, కీరదోస 30,కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 64, గోరు చి క్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అక్కిరెడ్డిపాలెం వెంకటేశ్వర కాలనీలో కృష్ణాష్టమి వేడుకలు



మొల్లివానిపాలెంలో జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



విజ్ఞాన్ కళాశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

అగనంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85వ వార్డుల్లోని అగనంపూడి, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో శనివారం వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దిబ్బపాలెం కృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పినమడక, ఫార్మాసిటీ కాలనీల్లో రాధాకృష్ణులను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల రెక్టార్ వి.మధుసుదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో...

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో వెంకటేశ్వరకాలనీలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగవద్గీత శ్లోఖ పఠనము చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లకలు కృష్ణాగోపిలక వేషదారణ పోటీలు, శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. ఆదివారం కృష్ణుని ఊరేగింపు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కృష్ణాష్టమి సదర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ క్షేత్రంలో స్వామివారు కృష్ణుని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కృష్ణుడికి పల్లకీ సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి పలు పుష్పాలతో సహస్రనామార్చన నక్షత్ర హారతి, కుంభ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

పెదగంట్యాడలో...

పెదగంట్యాడ (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వవార్డు పరిధి మొల్లివానిపాలెంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీమురళీ కృష్ణ సేవా సంఘం నిర్వహించిన పూజా కార్యక్రమంలో బాల కృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 74వవార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి మొల్లి పెంటిరాజు, కార్మిక సంఘం నాయకులు వంశీకృష్ణ సేవాసంఘం అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, సభ్యులు ఉరుకూటి అప్పలరాజు, మొల్లి వెంకటేశ్, మొల్లి రమణ, అప్పలనాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ 75వవార్డు ముసలినాయుడు పాలెం కృష్ణుని కోవెలలో శనివారం కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ సేవాసంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉరుకూటి శ్రీను, కిల్లాని రాజు, వార్డు బీజేపీ అధ్యక్షుడు కిల్లాని ముసలయ్య, స్టీల్ ఇంటక్ నాయకులు వైవీ.రమణ, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు రమేశ్, నరేశ్, డి చిన్నారావు, ఉరుకూటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. .



కృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

కూర్మన్నపాలెంలో...

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70, 71, 86, 87 వార్డుల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగ జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణ, గోపికల వేషదారణలో అలరించారు. 87వ వార్డులో నిర్వహించిన ఉట్టికొట్టు కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలు ఆలయాల్లో నిర్వహించిన కృష్ణాష్టమీ వేడుకల్లో ఆలయాల కమిటీ సభ్యులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు, మహిళలు

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ ధ్యేయం

» టీడీపీ గాజువాక యువత అధ్యక్షుడు బలగ బాలు నాయుడు

గాజువాక, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల మంచి చేయడమలే ప్రభుత్వ లక్ష్యమని గాజువాక టీడీపీ యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు అన్నారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం అమలు చేసిన సందర్భంగా 73వ వార్డులోని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం శనివారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా... ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. రానున్న రోజుల్లో మహిళల ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి'



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, సర్దార్ గౌతులచ్చన్న సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. గౌతులచ్చన్న 116 జయంతి పురస్కరించుకుని జీవీ ఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొండాజగన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిఒక్కరు భావితరాలకు ఆదర్శమన్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘపెద్దలు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 87వ వార్డు కణితిలో గౌతు లచ్చన్న జయంతిని వైసీపీ నాయకులు అయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న 116 వ జయంతిని శనివారం శెట్టిబలిజ ఉపకులాల సంఘం ఆధ్వర్యంలో షీలానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు పాల్గొన్నారు.

నేడు భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల గృహాలకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్లగా భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యుల కంటున్న కలలు ఆదివారం నిజం కానున్నాయి. సొసైటీ సభ్యుల గృహాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరగనున్నది. దీంతో 360 మంది సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి సొసైటీ పాలకవర్గం 360 మంది సభ్యులకు సొంతిళ్లు నిర్మించాలని సాలాపువానిపాలెం సమీపంలో 36 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. సొంతిళ్లు లభిస్తాయని ఆశతో అప్పట్లోనే లక్షల రూపాయిలు సొసైటీకి చెల్లించారు. కానీ అప్పటి పాలకవర్గం నిర్లక్ష్యం, స్థానిక రైతుల నిరసనలు, వీఎంఆర్‌డీఏ అప్రూవల్ వంటి సమస్యలు ఎదురవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఫలితం ఇప్పటి వరకు ఫలితం దక్కలేదు. సొంతింటి కోసం డబ్బులు కట్టిన సభ్యుల్లో కొందరు మృతి చెందగా, కొందరు పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి, గృహ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ గృహాలకు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు.

విపత్తు నిర్వహణలో జీవీఎంసీ అప్రమత్తం

» అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆదేశం

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలు, గాలివానలు, వడగళ్ల వాన వంటి సహజ విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జీవీఎంసీ అన్ని విభాగాలు తక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో మూడు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నగరంలో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న సమాచారంతో జీవీఎంసీ అప్రమత్తత చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు మురికివాడ ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలోనున్న భవనాలను గుర్తించి నగరంలో గల పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేశామని తెలిపారు. నగరంలో డ్రైనేజీ లైన్లు, మ్యాన్‌హోల్స్ అధికంగా నీరు ప్రవహించే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, అలాగే నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసినట్టు చెప్పారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం, కూలిన, విరిగిపడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున నగరంలో శిథిలావస్థలోనున్న హోర్డింగులను గుర్తించి వాటిని వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలని, అగ్ని ప్రమాదాలు సంభవించినట్టయితే ప్రజల రక్షణ దిశగా జీవీఎంసీ రీజనల్ అగ్నిమాపక అధికారి తగు చర్యలు చేపడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని, జీవీఎంసీకి సంబంధించిన వాహనాల్లో ఇంధనం, సమాచార రేడియో హ్యాండ్ సెట్‌లను వంటి పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించామ న్నారు. అలాగే జోనల్, సచివాలయ పరిధిలో ఉద్యోగులను సిబ్బందిని రక్షణ చర్యల చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్టు కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు గృహాల్లో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వాడాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆడనివ్వకూడదని వర్షపు నీటిలో ప్రయాణం చేయకుండా ఉండాలని, చెట్లు హోర్డింగులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కింద, శిథిలావస్థ భవనాల్లో ప్రజలు ఉండరాదని ప్రజలకు కమిషనర్ సూచించారు.

వేడుకగా వేణుగోపాలుని ఉత్సవం



వేణుగోపాలస్వామి ఆలయంలో గండి బాబ్జీ తదితరుల పూజలు



వెంకటాపురంలో పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు



తుమ్మెడిపాలెం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావును సన్మానిస్తున్న దృశ్యం

పెందుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శనివారం వివిధ ప్రాంతాల్లో వేణుగోపాలుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టి వెన్నదొంగ లీలలను కనువిందుగా ఆచరించారు. పురుషోత్తపురంలోని వేణుగోపాల స్వామి ఆల యంలోశ్రీకృష్ణభగవానుని మూలవిరాట్టు విగ్రహానికి చక్రస్నానం చేయించి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు, నక్షత్ర హారతులిచ్చారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. గారడీ, కోలాటం, కూచిపూడి నృత్యాలు, తిరువీధి ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరాడ చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేంకటేశ్వరుడిని కృష్ణావతారంలో అలంకరించారు. జంగాలిపాలెంలోని శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం అన్నసమారాధన ప్రారంభించారు. సర్పంచ్ గొరపల్లి నర్సింగరావు పాల్గొన్నారు. పెందుర్తి ప్రశాంతినగర్, బృందావన్ విహార్ కాలనీ, దొగ్గవానిపాలెం, రాంపురంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.

గోపిజన వల్లభస్వామి ఆలయంలో ..

వేపగుంట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ దరి లక్ష్మీనరసింహనగర్‌లో కొలువైన గోపిజన వల్లభస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామికి ఉదయం క్షీరాభిషేకం, సహస్ర పుష్పార్చన, సామూహిక విష్ణుసహస్రనామం, భగవద్గీత పారాయణం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్లు పి.వి.నరసింహం, బల్ల శ్రీనివాసరావు, బెహరా భాస్కరరావు, విశాఖ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, పెందుర్తి పీఏసీ చైర్మన్ అయితం సింహాచలం పూజలు చేశారు. సాయంత్రం స్వామి ఊయల సేవ, శ్రీసత్యసాయి నృత్యమందిర్ వారిచే భరతనాట్యం, చిన్నికృష్ణుల నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు. అప్పన్నపాలెం దరి బాలాజీ హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో వేడుకలు వైభవంగా నిర్వహించారు. భరత్‌నగర్ దరి గొల్ల నారాయణపురంలో రాధాకృష్ణ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ప్రతిమను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు.

బుచ్చిరాజుపాలెంలో...

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని కృష్ణ ఆలయంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, ఉట్టి కొట్టడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆర్పీపేట(కంచరపాలెం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలోని ఆర్పీపేట, గవరకంచరపాలెం, తుమ్మడిపాలెం, ఐటీఐ జంక్షన్, ఆశవానిపాలెం గ్రామాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక తుమ్మడిపాలెంలో పశ్చిమ నియోజకవర్గం శ్రీకృష్ణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెంటకోట అజయ్‌బాబు, కుట్టా కార్తీక్, కార్పొరేటర్ మురువాణి, గిరి రాజు పాల్గొన్నారు.

కొత్త నక్కవానిపాలెంలో...

మల్కాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణ జన్మాష్టమిని శనివారం ఘనంగా జరిపారు. టీఎన్‌టీయూసీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు సౌజన్యంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ ప్రారంభించారు. సంఘ పెద్దలు దాకరపు నూకరాజు, బంగారురాజు, కిలాడి పైడిరాజు, 59వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఉరుకూటి హరిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి దొంకాన రాంబాబు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు. నక్కా లక్ష్మణరావును సన్మానించారు.

గోపాలపట్నంలో...

గోపాలపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతగోపాలపట్నం, వెంకటాపురం, చంద్రనగర్‌లోని కృష్ణుడి ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు స్వామివారిని దర్శించుకుని ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల మండపాలు ఏర్పాటు చేసి జన్మాష్టమి వేడుకల్ని నిర్వహించారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ మృతి



పులమరశెట్టి సూర్యనారాయణ (ఫైల్)

పెందుర్తి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, చింతల అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు పులమరశెట్టి సూర్యనారాయణ అలియాస్ సూరిబాబు (76) శనివారం ఉదయం చింతల అగ్రహారంలోని తన స్వగృహంలో మరణించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సూరిబాబు భార్య ఇదివరకే మరణించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు సూరిబాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పెందుర్తి సాయి హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాసరావు చొరవతో సూరిబాబు నేత్రాలను దానం చేయడానికి కుమారుడు శ్రీదర్‌లక్ష్మణ్ అంగీకరించారు. మోషిన్ ఐబ్యాంక్ అధికారులు సూరిబాబు కార్నియాలు సేకరించారు. మరో ఇద్దరికి చూపు కల్పించినందుకు సూరిబాబు కుటుంబ సభ్యులను గ్రామస్థులు అబినందించారు.

ఊరట కలిగించిన వర్షం



పెందుర్తి కూడలిలో వర్షపునీరు

పెందుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా పెందుర్తిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం, సాయంత్రం సమయాల్లో విరామం లేకుండా గంటపాటు ఏకధాటిగా కురిసిన వానకు జనజీవనం స్తంభించింది. పలు కాలనీల్లో రహదార్లపై నీరు ప్రవహించింది. కొన్ని కాలనీల్లో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వర్షపు నీటితో పెందుర్తి నాలుగురోడ్ల కూడలి జలమయమైంది. ప్రవాహ మార్గం లేక రహదారి పైనే వాన నీరు నిలిచిపోయింది. ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించిన ఈ వాన వ్యవసాయ రంగానికి ఎంతో ఊరట కలుగుతుందని రైతులు అంటున్నారు. ఎండిన నారుమడులకు జీవం పోసినట్లయిందని తెలిపారు.

సుందరంగా చంద్రనగర్ అండర్‌పాస్ వే



అండర్‌పాస్‌వే గోడపై గీసిన సుందరచిత్రం

గోపాలపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెనుక భాగంలో చంద్రనగర్ వద్ద నిరుడు నిర్మించిన అండర్‌పాస్‌వేను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అండర్‌పాస్‌వే లేని రోజుల్లో రైలుగేటు దాటుకుని భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే గంటల సమయం పట్టేది. ప్రస్తుతం అండర్‌పాస్‌వే అందుబాటులోకి రావడంతో గోపాలపట్నం దిగువ ప్రాంతంలోని వేలాది మందికి ఎంతో మేలు జరిగింది. ఈ అండర్‌పాస్‌వే పైన ఇటీవల షెల్టర్ నిర్మించారు. అండర్‌పాస్‌వే గోడలపై చిత్రాలు వేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

మల్కాపురంలో వాజపేయికి ఘన నివాళి



వాజపేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

మల్కాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి కార్యక్రమం 59వ వార్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయబాబు పాల్గొని వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం, విమానాశ్రయాల అభివృద్ధిలో వాజపేయి కృషి అనన్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు సతీష్, అప్పారావు, హేమరావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

సీఐ గొలగాని అప్పారావుకు ప్రశంసలు

మల్కాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, కానిస్టేబుల్ మురళీని నగర పోలీసు కమిషనర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాసు, సిబ్బంది కూడా అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. తప్పుచేసిన వ్యక్తికి శిక్ష పడేలా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు.

ఆర్టీసీలో చలో చలో..

స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళల హర్షాతిరేకం

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు


ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు టికెట్లు ఇస్తున్న కండక్టర్

పెదగంట్యాడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. శనివారం నుంచి అమలులోకి వచ్చిన ఈ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఎంతో ఆనందంగా తమ గమ్య స్థానాలకు రాకపోకలు సాగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల వివిధ ప్రాంతాల్లో పనులు చేసుకునే మహిళా ఉద్యోగులు, ఇతర పనులు చేసుకునే వారికి, రోజువారి కూలీలకు ఆర్థికంగా ప్రతినెలా కొంత మొత్తం ఆదా అవుతుందన్నారు. తద్వారా కుటుంబాలకు ఆర్థిక ఆసరా లభిస్తోందని పేర్కొంటున్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఆసరా లభిస్తోంది

-డి.లక్ష్మి, చిరు వ్యాపారి



ఉచిత బస్సు సౌకర్యం వల్ల నాలాంటి మహిళలకు ఆర్థికంగా కొంత వెసులు బాటు లభిస్తోంది. నగరంలోని హోల్‌సేల్ మార్కెట్లకు సరకులను తెచ్చుకునేందుకు అయ్యే రవాణా ఖర్చులు ఇకపై ఉండవు. తద్వారా నెలకు సుమారు వెయ్యి రూపాయల వరకు ఆదా అవుతోంది. స్త్రీశక్తి పథకం కింద ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో చిరు వ్యాపారాలు సాగించే మహిళలకు, ఇతర పనులు చేసుకునే వారికి ఈ పథకం ఎంతో ఉపయుక్తం.

నిర్వహణా వ్యయం తగ్గుతోంది

-జి.కృష్ణవేణి, టైలర్



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం వల్ల నాలాంటి స్వయం ఉపాధి పనులు చేసుకునే వారికి నిర్వహణా వ్యయం తగ్గుతోంది. నాణ్యమైన టైలరింగ్ మెటీయల్‌ను తక్కువ దరకు లభించే హోల్‌సేల్ మార్కెట్‌కు నుంచి తెచ్చుకునేందుకు ఇకపై ఎలాంటి రవాణా చార్జీలు చెల్లించనవసరం లేదు. అవసరమైన మెటీరియల్ కోసం హ్యాపీగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి రావచ్చు.

స్వయం ఉపాధికి ఊతం

-వై.దుర్గాదేవి, బ్యూటీషియన్



స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభు త్వం ఉచిత బస్సు ప్రయాణ భాగ్యాన్ని కల్పించడం ద్వారా స్వయం ఉపాధి వృత్తులు సాగించే నాలాంటి మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. బూటీషియన్ కోర్సులు చేసేందుకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా రాకపోకలు సాగించడం వల్ల నెలకు కొంత మొత్తం మిగులుతోంది. అంతేకాక విజయవాడ, విజయనగరం, కాకినాడ వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా వెళ్లి నాణ్యమైన బ్యూటీషియన్ మెటీరియల్‌ను కొనుగోలు చేసి తిరిగి ఇంటికి రావచ్చు. ఈ పథకం మహిళ ఆర్థిక స్వావలంబనకు ఉపకరిస్తోంది.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం

-టి.జ్యోతి, ప్రైవేటు ఉద్యోగిని, గోపాలపట్నం



స్త్రీశక్తి పథకం వల్ల మహిళలకు ఎంతో చేకూరుతోంది. గోపాలపట్నం నుంచి రోజూ విధుల నిమిత్తం జ్ఞానాపురానికి రాకపోకలు సాగిస్తుంటా. ఇందుకు రోజుకు రూ.50 ఖర్చయ్యేది. స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇప్పుడు నెలకు సుమారు రూ.1,500 వరకు ఆదా అవుతుంది. నాలాంటి మహిళలకు ఈ పథకం గొప్ప వరం వంటిది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

ఉచిత బస్సు ప్రయాణంతో ఎంతో మేలు

-కె.పద్మ, గాజువాక



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకెంతో మేలు జరుగుతోంది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేసేవారికి ఇది మంచి శుభపరిణామం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారు. మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయం. చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు, యువతులు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు స్త్రీశక్తి పథకం ఒక వరం.

నెలకు రూ.2,000 మిగులు

టి.రమణమ్మ, విజయనగరం



మాది విజయనగరం సమీపంలోని ఓ పల్లెటూరు. వారానికి రెండుసార్లు గాజువాక వస్తుంటాను. కుటుంబ అవసరాల నిమిత్తం నెలలో కనీసం పదిసార్లు విజయనగరం నుంచి గాజువాకకు రాకపోకలు సాగిస్తా. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నెలకు సుమారు రూ.2,000 మిగులుతోంది. ఈ ఆదాయం కుటుంబానికి ఆర్థికంగా ఎంతో ఆసరాగా ఉంటోంది.

పుణ్యక్షేత్రాలకు హ్యాపీగా వెళ్లి రావొచ్చు

-బెహరా లక్ష్మి, సింధియా



తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని సీఎం చంద్రబాబు మరోసారి నిరూపించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం నాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మేం ఎక్కువగా పుణ్యక్షేత్రాలకు వెళుతుంటాం. ఇప్పుడు హ్యాపీగా రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలకు రాకపోకలు సాగించవచ్చు. డబ్బులు ఆదా చేయవచ్చు.

మహిళల పక్షపాతి చంద్రబాబు

-సారిపల్లి జ్యోత్స్న, వడ్లపూడి



మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయం. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముందడుగు వేసింది ఆయనే. మహిళలకు ఆర్థిక ఆసరా కల్పించేందుకు దీపం పథకం, తల్లికి వందనం, ఇప్పుడు స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టుంది.

ప్రయాణం.. ఆనందం

-ఎ.అనురాధ, కణితి



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఒక వరం వంటిది. ఇది స్త్రీ పక్షపాత ప్రభుత్వం. తల్లికి వందనం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి మహిళలకు ఆర్థికంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. రోజూ కుటుంబ అవసరాల నిమిత్తం ఆటోల్లో రాకపోకలు సాగించడం డబ్బులు ఖర్చయ్యేవి. ఇప్పుడు ఎంచక్కా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా రాకపోకలు సాగించవచ్చు.


ఊంజల సేవలో సీపీ శంఖబ్రత బాగ్చి


శ్రీకృష్ణుని దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన ఇస్కాన్

సాగర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం భక్తులతో కిటకిటలాడింది. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రధాన వేడుకను వైభవంగా నిర్వహించారు. మంగళహారతులతో పూజలు ప్రారంభించారు. ఇస్కాన్ విశాఖ అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని కృష్ణలీలలపై ప్రవచనాలు చేశారు. పుణ్య నదుల నుంచి తెచ్చిన జలాలతో అభిషేకం చేసి, బృందావనం నుంచి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, పుష్పాలతో రాధా దామోదరలను అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బాలగోపాలుడి ఉయ్యాల సేవలో భక్తులు తరించారు. 108సార్లు హరేకృష్ణ మహా మంత్రాన్ని జపించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వందలాది మంది చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. 108 కళశాలతో మహా అభిషేకం, 1,008 దీపాలతో మహా హారతి చేపట్టారు. సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు వాహనాలపై ఇక్కడకు రావడంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. గంటలతరబడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

భారీ వర్షం


జాతీయ రహదారి అక్కయ్యపాలెంలో శనివారం రాత్రి కురుస్తున్న వర్షం

మహా నగరంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పెద్దఎత్తున పిడుగుల శబ్దం రావడంతో నగరవాసులు బెంబేలెత్తిపోయారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గత కొంతకాలంగా ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించినట్టయింది. అయితే వర్షంలో తడుస్తూనే పలువురు వాహనదారులు తమ గమ్య స్థానాలకు చేరుకున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



వర్షంలో తడుస్తూనే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు


రైల్వే స్టేషన్ రోడ్డులో పెద్దఎత్తున చేరిన వర్షపు నీరు


జ్ఞానాపురం బ్రిడ్జి కింద ...



రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రయాణికుల పాట్లు, పక్కన జ్ఞానాపురం బ్రిడ్జి కింద పాదచారుల అవస్థలు

క్రైం... crime news

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ

» క్యాబిన్, స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయిన ఓ డ్రైవర్


క్యాబిన్‌లో ఇరుకుకపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

అగనంపూడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అగనంపూడి కూడలిలో ముందు వెళుతున్న లారీని వెనక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్టీరింగ్, క్యాబిన్ మధ్యలో ఇరుక్కుపోవడంతో గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం హిందూజా పవర్ ప్లాంట్ నుంచి వస్తున్న లారీ అగనంపూడి కూడలి వద్దకు వచ్చేసరికి వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో డ్రైవర్ సడన్ బ్రేకులు వేశాడు. దీంతో వెనుక వస్తున్న మరో లారీ దానిని బలంగా ఢీకొంది. దీంతో వెనుక ఉన్న లారీ డ్రైవర్ స్టీరింగ్, క్యాబిన్ మధ్యలో ఇరుక్కుపోయాడు. స్థానికుల సహాయంతో ఆయనను బయటకు తీశారు. అయితే రహదారి మధ్యలో రెండు లారీలు నిలిచిపోవడంతో కాసేపు ట్రాఫిక్ స్తంభించి పోయింది.

పేలుడు ఘటనలో మరొకరి మృతి

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్ పేలుడు ఘటనలో ఇ.రంగారావు(56) అనే మరో వ్యక్తి మృతి చెందాడు. ఇటీవల ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ షాపులో భారీ పేలుడు సంభవించటంతో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో ముగ్గురు కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, వీరిలో ఇ.రంగారావు అనే వ్యక్తి మృతి చెందాడు. ఇతడు పేలుడు సంఘటన జరిగిన ప్రాంతం పక్కనే స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. దీనితో ఈ ఘటనలో మృతులు నాలుగుకు పెరిగారు. మరో ఇద్దరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

వైసీపీకి దామా సుబ్బారావు రాజీనామా


రాజీనామ పత్రాన్ని చూపిస్తున్న దామా సుబ్బారావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో వైసీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. 86వ వార్డు పరిధి కూర్మన్నపాలేనికి చెందిన వైసీపీ సీఈసీ సభ్యుడు దామా సుబ్బారావు తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు శనివారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో అవమానాలు, ఆటుపోట్లను తట్టుకుంటూ వచ్చానని, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానన్నారు. కానీ అధిష్ఠానం తనను గుర్తించకపోగా, చిన్నచూపు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే ఏడాదిగా వైసీపీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నానని పేర్కొన్నారు. అభిమానులతో సంప్రదించాక రానున్న రోజుల్లో ఏ పార్టీలో చేరాలన్నది నిర్ణయం తీసుకుంటానని దామా సుబ్బారావు తెలిపారు.

వర్షాలకు కూలిన ఇంటి గోడలు


గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్.ఐ. కోమలి, గంకల అప్పారావు

కంచరపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 48వ వార్డు పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో రెండు ఇంటిగోడలు కూలాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. గోడ కూలిన సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయన ఫిర్యాదు మేరకు రెవెన్యూ బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. గోపాలపట్టణం తహసీల్దార్ సంఘటన వివరాలను గంకల కవిత అప్పారావు ద్వారా తెలుసుకున్నారు. ఆర్.ఐ కోమలి, వీఆర్వోలు చంద్రశేఖర్, జగదీష్ శనివారం రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. సమీపంలోని నివాసితులను సురక్షిత ప్రదేశానికి పంపించారు. కొండవాలు ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని గంకల కవిత అప్పారావు హామీ ఇచ్చారు.

కేంద్ర కారాగారం డి-అడెక్షన్ సెంటర్‌లో తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) విశాఖ కేంద్ర కారాగారంలో డ్రగ్, డీ అడిక్షన్ సెంటర్‌లో తాత్కాలిక ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, కం క్లర్క్, కౌన్సెలర్, సామాజిక కార్యకర్త, మేల్ నర్సు, వార్డు బాయ్, పీర్ ఎడ్యుకేటర్ ఉద్యోగాల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు వెల్లడించారు. 21- 35 మధ్య వయస్కులు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేయవచ్చన్నారు. విశాఖ నగరానికి చెందిన స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. 'సంపత్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్, జైళ్ల శాఖ ప్రాంతీయ డీఐజీ కార్యాలయం, రాజమండ్రి' చిరునామాకు దరఖాస్తులు పంపాలని వెల్లడించారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 89196 43268లో సంప్రదించాలన్నారు.

'స్కోపస్ పబ్లికేషన్స్ నిబంధన యూజీసీ నిబంధనలకు విరుద్ధం'

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ థీసెస్ సమర్పించడానికి కొత్తగా స్కోపస్ పబ్లికేషన్ ఉండాలంటూ ఏయూ అధికారులు తీసుకువచ్చిన రూల్ యూజీసీ నిబంధనలకు విరుద్ధమని ఆంధ్రా యూనివర్సిటీ స్టూడెంట్ ఫోరమ్ పేర్కొంది. ఈ మేరకు ఏయూ వైస్ చాన్సలర్‌కు రాసిన లేఖను ఫోరమ్ మీడియాకు విడుదల చేసింది. ఇందులో అనేక కీలకమైన అంశాలను పేర్కొన్నారు. ఏయూ తీసుకువచ్చిన కొత్త నిబంధన యూజీసీ రెగ్యులేషన్స్-2022కు విరుద్ధమని, సాధారణంగా థీసెస్ సమర్పించడానికి ఏదైనా రెండు జర్నల్స్‌లో పబ్లికేషన్స్ ఉంటే సరిపోతుందని, ప్రత్యేకించి స్కోపస్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా తీసుకువచ్చిన ఈ నిబంధన గతంలో పీహెచ్‌డీ థీసెస్ సమర్పించిన వారితో పాటు ఇంకా సమర్పించబోయే వారికి వర్తింపజేయడం సమంజసం కాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

కేజీహెచ్‌లో గుండె శస్త్రచికిత్సలు పునఃప్రారంభం

» తొలిరోజు విజయవంతంగా ఓపెన్ హార్ట్ సర్జరీ

మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో ఎనిమిది నెలలుగా నిలిచిపోయిన గుండె శస్త్రచికిత్సలు పునఃప్రారంభించారు. కార్డియాలజీ విభాగంలో హార్ట్ లంగ్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్‌లు అందుబాటులో లేకపోవటంతో ఎనిమిది నెలలుగా శస్త్ర చికిత్సలు జరగక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మీడియాలో వార్తా కథనాలు విస్తృతంగా రావడంతో ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం వైద్య పరికరాలు సమకూర్చింది. దీనితో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బి.మావుళ్ళు (70) అనే వ్యక్తికి శనివారం ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్స పరికరాలు సమకూరడంతో ఇక నుంచి గుండె సంబంధిత శస్త్రచికిత్సలు జరుగుతాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులను ఆమె అభినందించారు.